




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 242 | ది. 3-12-2025 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 242 | Date : 3-12-2025 | Wednesday | Pages : 8 | Rs.1/- |


# వినియోగదారే విద్యుత్ ఉత్పత్తిదారు

## విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ఉత్పత్తి
- ఫెర్రో అల్లాయ్స్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాలు పొడిగింపు
- ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు
- రాష్ట్రంలో 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- ఎనర్జీ రంగంలో ఒప్పందాలు 60 రోజుల్లో కార్యారూపం దాల్చాలి
- పీపీఏల రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం మోపిన గత పాలకులు
- విద్యుత్ వ్యవస్థల సమర్థ నిర్వహణతో భారాన్ని జీరో చేశాం



**అమరావతి,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కీలకమైన పరిశ్రమలుగా వీటిని గుర్తించి మరో ఏడాదిపాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. తద్వారా ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం పడనుంది. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, పీఎం కుసుమ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ పథకం, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యయం తగ్గింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను 2029 నాటికి 9.20 శాతం నుంచి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సీఎం సూచించారు. పీఎం కుసుమ్ సహా ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద 4,792 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు 483కు పైగా ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేసి 150 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా విద్యుత్ పొదుపు చేసేలా ఉపకరణాలు వినియోగించేందుకు అవగాహనా కార్యక్రమాల్ని చేపట్టాలని సీఎం సూచించారు.

**ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లో కార్యాచరణ..** రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థలు ఐస్(ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ) పాలసీ ద్వారా 60 రోజుల్లోనే తమ కార్యాచరణను ప్రారంభించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ ఓ న్యూ ఎనర్జీ హబ్‌గా మారాలని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందని అన్నారు. అలాగే విద్యుత్ సంస్థలు రుణ సమీకరణలో వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20 పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్టు సీఎస్ కె.విజయానంద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈపీఎంఎస్ విధానంతో నిరంతరం పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు చేయగలిగామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఒప్పందాల ద్వారా కొనుగోలు వ్యయం తగ్గుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలకు, వాణిజ్యం, గృహ అవసరాలు, వ్యవసాయ రంగానికి జరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని.. డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పీఎం కుసుమ్ కింద దేవాదాయ, జలవనరుల శాఖలకు చెందిన భూముల్లో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. వినియోగదారులే విద్యుత్ ఉత్పత్తి చేయటం ద్వారా తాము వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం ఆర్జించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే సోలార్ రూఫ్ టాప్ పథకం కింద సౌర ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు.

# గ్రామాల్లో హామీల హోరు..

# ఏకగ్రీవాల జోరు..




**హైదరాబాద్,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జోరందుకుంటున్నాయి. లక్షల్లో వేలంపాటలు పాడుతున్నారు. వేలంపాట ద్వారానో, ఊర్లో స్కూల్, ఆలయాలు ఇతర నిర్మాణాలు చేస్తామని, గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామనే హామీతోనో, ఒక్కరే నామిషన్ వేయడంతోనో పలు గ్రామాల్లో అభ్యర్థులు సర్పంచ్గా ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఏకగ్రీవాల కోసం పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లాలో 10 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి జిల్లాలో ఐదు గ్రామపంచాయితీలు ఏకగ్రీవమైతే ఇందులో వర్ని మండలంలోనే ఎనిమిది ఏకగ్రీవం అయినట్లు తెలుస్తోంది.కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం శివారు రాంరెడ్డిపల్లిలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధరణి లక్ష్మి తనను ఎన్నుకొంటే గ్రామంలోని అంతర్గత రహదారులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 22 గ్రామాలు, నిర్మల్ జిల్లాలో ఎనిమిది గ్రామాలు కూడా ఏకగ్రీవమయ్యాయి. ఇక మెదక్ జిల్లా చిన్న శంకరంపేటలో.. పార్టీలకు అతీతంగా ముదిరాజ్ కులస్థులు అంతా ఏకమయ్యారు. తమకు ఎప్పుడూ అవకాశం రాలేదని, అందుకే ఈసారి ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలంటూ హేమ దుర్గపతి అనే వ్యక్తిని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టారు. మిగతా జిల్లాలకు భిన్నంగా ఖమ్మం జిల్లాలో వేలంపాట రహితంగా ఆరు గ్రామాలు, జనగామ జిల్లాలో ఆరు, వరంగల్ జిల్లాలో ఐదు, మహబూబాబాద్ జిల్లాలో మూడు, మహబూబ్నగర్ జిల్లాలో రెండు, ములుగు జిల్లా, భూపాలపల్లి జిల్లాలో ఒక గ్రామం చొప్పున ఏకగ్రీవం కావడం గమనార్హం. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్న అడిశర్లపల్లి గ్రామంలో అభ్యర్థి వెంకటయ్య రూ.51.3 లక్షలతో ఊర్లో బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు శివాలయం నిర్మిస్తానని మాటివ్వడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుర్రంపోడు మండలం ములకలపల్లిలో అభ్యర్థి బొడ్డు లింగస్వామి రామాలయం నిర్మాణానికి ముందుకురాగా ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొనేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు.

**కోతుల బెడద తీర్చితే..** ఇక గ్రామాల్లో కోతుల బెడద చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ బెడద ఎంత తీవ్రంగా ఉందంటే కోతుల బెడద తీర్చినవారిని గ్రామ సర్పంచ్గా ఎన్నుకుంటామనేంత. అవును మంచిర్యాల జిల్లా దండేపల్లి ప్రజలు ఈ డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సోమవారం ప్లకార్డులు పట్టుకొని మరీ.. కోతులు, కుక్కల బెడద తీర్చిన వారికే ఓటేస్తాం అంటూ నినాదాలు చేయడం గమనార్హం. ఊర్లో ఉదయం సాయంత్రం సమయాల్లో కోతులు, కుక్కలు గుంపు గుంపులుగా వచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయని, వాటి దాడుల్లో ఇటీవల పలువురు గాయపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. అందుకే వాటి బెడద తీర్చిన వారికే ఓటేస్తామంటున్నారు.

**ఎన్నికల కోసం అమెరికా వదిలి...** గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎక్కడెక్కడివారినో గ్రామాలకు రప్పిస్తున్నాయి. తాజగా నాగర్కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి గ్రామానికి చెందిన కమతం నందిని శ్రీనివాస్ రెడ్డి అనే మహిళ ఎన్నికల్లో పోటీ చేయడానికి అమెరికా నుంచి వచ్చింది. ఆమెకు ముగ్గురు పిల్లలుండగా వారంతా అమెరికాలో స్థిరపడ్డారు.

# మొంథా తుపాను నష్టం రూ. 6,352 కోట్లు

- కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రులు లోకేష్,అనిత భేటీ
- తుపాను నష్టంపై నివేదిక అందజేత



**న్యూఢిల్లీ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** ఇటీవల ఆంధ్రప్రదేశ్ లో సంభవించిన మొంథా తుపాను కారణంగా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో అన్నిరంగాలకు కలిపి రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిలిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత తెలిపారు. న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మంత్రులు లోకేష్, అనిత లు భేటీ అయి మొంథా తుపాను నష్టంపై నివేదికను అందజేశారు. తుపాను కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. మొంథా తుపాను వల్ల మొత్తం 3,109 గ్రామాలు ప్రభావితమయ్యాయి. అక్టోబర్ 28వ తేదీ రాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 100 కి.మీ. వేగంతో గాలులతో భారీవర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అప్రమత్తమై 1.92 లక్షల మందిని 2,471 పునరావాస శిబిరాలకు తరలించింది. వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు, ఇతర వస్తువులను అందించింది. ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3వేలు అందించాం. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాలు, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి పలు చర్యలను చేపట్టింది.


## దస్తావేజులు పోయినవి

హైదరాబాద్ వాస్తవ్యుడు, ప్రస్తుతం (హోల్‌మకాం) ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ అర్బన్, విద్యాధరపురం, కొట్టేటి కోటయ్య వీధి, డోరు నెం.1-23-36 కాపురస్తుడు పువ్వాడ కృష్ణమూర్తి గారి కుమారుడు పువ్వాడ ఆనంద్ మోహన్‌రావు అను నా పేరిట ది.30-06-2004వ తేదీన ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రీ కాబడిన దస్తావేజు నెం.3583/2004 గల ఒరిజినల్ విక్రయ దస్తావేజు, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన లింకు దస్తావేజు నెం.5014/1985 మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను తీసుకొని ది.19-11-2025వ తేదీన మా ఇంటి నుండి భవానీపురం సెంటర్‌లో జిరాక్సు తీయించుకునేందుకు వెళ్ళ సందర్భంలో పోయినవి. వెంటనే పరిసర ప్రాంతములో వెతకగా ఎక్కడా కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజులను ఎవరికినీ తాకట్టు పెట్టుట గానీ, అన్యాక్రాంతపములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.9962238068


# స్వర్ణాంధ్ర ప్రయాణంలో అడుగులు కలపండి

- రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం
- సీఎం ఆకాంక్షల మేరకు సేవలందిద్దాం
- సమాచార మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు చేస్తున్న ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలిపి రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని, ముఖ్యమంత్రి ఆకాంక్షల మేరకు ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కోరారు.ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు అసోసియేషన్ నాయకులు మంగళవారం తాడిగడప సమీపంలోని మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో మంత్రి పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్ ఏ 2047 సాధన వైపు చేస్తున్న ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలిపి సహకరించేందుకు ముందుండాల్సిన అవసరముందన్నారు. కొన్నేళ్లపాటు అభివృద్ధిలో గాడితప్పిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి తన అపార అనుభవం, దార్శనికతతో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు కీలకమైన పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడమే కాకండా అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సులో రికార్డు స్థాయిలో పెట్టుబడులు సాధించినట్లు వివరించారు.



ఈ పెట్టుబడుల ద్వారా మన యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టనుందన్నారు. ఈ తరుణంలో అభివృద్ధి కార్యాచరణ అమల్లో ఉద్యోగులు సహకారం ఎంతో కీలకమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ మరింత పారదర్శకతతో ప్రజలకు సేవలందించినప్పుడు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతామన్నారు. ఉద్యోగ సమాచారం మాస పత్రికలో ప్రభుత్వ నిర్వహిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల కథనాలు ప్రచురించాలని కోరారు.ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని.. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. ఉద్యోగులను ఏకతాటిపై నడిపిస్తూ నిబద్ధతతో సేవలందించేలా ఉద్యోగ సంఘ నేతలు కృషిచేయాలని మంత్రి కోరారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల కోసం ఎంత చిత్తశుద్ధితో పోరాడుతామో.. దేశంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడి ఉద్యోగులు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడుగారు విజన్ ఉన్న నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు ఉందని.. ఆయన సీఎం అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందనే భావనతో ఉద్యోగులందరూ ఐక్యంగా మద్దతు పలికారన్నారు. ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాల అమలు ద్వారా 100 శాతం ఫలితాలు సాధించేలా ఉద్యోగులు కృషిచేస్తున్నట్లు విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రత్యేకముగ దృష్టి సారించాలని కోరారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపై ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని వేయటం హర్షదాయకమని రెండు నెలల్లోనే ఉద్యోగులు హెల్త్ కార్డులు అందరికీ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# జర్నలిస్టుల సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధించండి

## -ఏ.పి.ఎం.పి. ఏ. రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరాం యాదవ్ డిమాండ్







**ఏలూరు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వాల హయాంలో ఉన్న జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏ.పి.ఎం.పి.ఏ.) రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా కన్వీనర్ మెరుగు మువ్వల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశం లో శ్రీ రామ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రతి రోజు అనేక జీ.ఓ.లను విడుదల చేస్తున్న ప్రభుత్వం, ప్రజలకు ప్రభుత్వంకు వారధిగా నిలుస్తూ సమాజ శ్రేయోభిలాషులైన జర్నలిస్టుల సంక్షేమం లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రత కోసం ఇవ్వవలసిన అక్రిడేషన్, జర్నలిస్టులో అబద్ధత భావాన్ని పెంచే విధంగా తయారైందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న జర్నలిస్టులకు కొత్తగా అక్రిడిటేషన్ ఇవ్వలేక పోవటం ప్రభుత్వ నిర్లక్ష్యం కు నిదర్శనంగా ఉందన్నారు,మీడియా అక్రిడిటేషన్ జీ.ఓ. ఇచ్చిన ఆరు నెలల తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి నేటికి ఇవ్వలేక తీవ్ర ఆలస్యం చేస్తూ ఉండటం వల్ల వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతా భావానికి గురి అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీవోలో ఉన్న తప్పులు సరిచేసి తక్షణమే వర్కింగ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అందరికీ సులభతరంగా అక్రిడేషన్ మంజూరు అయ్యే జీవోలు తగు మార్పు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న జర్నలిస్టు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ,, సంక్షేమ నిధి తక్షణమే పునరుద్ధదించాలని, జర్నలిస్ట్ హెల్త్ కార్డు పరిమితి రెండు లక్షల నుంచి ఇరవై లక్షలకు పెంచాలని శ్రీ రామ్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాక ఇంటి నిర్మాణానికి తగు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు పెన్షన్స్ సౌకర్యం అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వర్కింగ్ మీడియా ప్రతినిధులకు 15,000 పెన్షన్ సౌకర్యాన్ని కలిగించాలని ఆయన కోరారు. జర్నలిస్టుల మీద, పత్రిక కార్యాలయాల మీద దాడులు జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే మీడియా దాడుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు. డిసెంబర్ 15 లోపల జర్నలిస్ట్ సంక్షేమ పథకాల పునరుద్ధరణ పై విధాన ప్రకటన రాకపోతే ఏ.పి.ఎం.పి.ఏ. ఉద్యమ బాట పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎం.పి. ఏ.జిల్లా కో. కన్వీనర్ లు నాగబోయిన పేర్రాజు,ఎం.జీవన్ ప్రసాద్ మరియు సీనియర్ గౌరవ సలహాదారులు దాసరి రామచందర రావు,నాయకులు ఎర్లీ పోస్ట్ ఎడిటర్ మిల్టన్ మరియు నాయకులు సతీష్,పళ్లెం అబ్రహం, చప్పిడి వాసు,, దాసరి రామచందర్ రావు, టి.నరేష్,పి. సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఇటివల విజయవాడ నుంచి ఏలూరు జిల్లా కు జిల్లా సమాచార శాఖ ఏ.డి.బాధ్యతలు స్వీకరించిన పాత్రికేయ ఆత్మీయులు యు. సురేంద్రనాథ్ ను శాలవా తో సత్కరించారు.

# విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

## -వైఎస్సార్ సీపీ నేత కుంచే రమణారావు




**అమలాపురం/ఉప్పలగుప్తం,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** అమలాపురం విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగుతాయని విద్యకు పేదరికం అడ్డుకారాదని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరులో పేద కుటుంబానికి చెందిన కొడమంచిలి వెంకటేశ్వరరావు కుమార్తె కృపావతి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న రమణారావు కృపావతి చదువు కొనసాగించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృపావతి చదువు కొనసాగించేందుకు రమణారావు రూ. 25 వేలు చెక్కును కృపావతికి అందజేసి భరోసా ఇచ్చారు.ఆర్థిక సాయం అందజేసే చదువును ప్రోత్సహిస్తున్న రమణారావుకు ఈ సందర్భంగా కృపావతి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీను,నక్కా సంపత్ కుమార్,పందిరి సుబ్బరాజు,గంటా లక్ష్మీప్రసాద్,వినోద్, జోసెఫ్,అంజి పాల్గొన్నారు.

# ప్రతి మంగళవారం అన్న ప్రసాద వితరణ



**విస్సన్నపేట,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి మంగళవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు పసుపులేటి అంజయ్య నాయుడు జయశ్రీ దంపతులు కుటుంబ పెద్ద సౌజన్య నాయుడు తెలియజేశారు. 18 నెలలుగా గత శ్రీరామనవమి నుండి ప్రతి శనివారం శ్రీ శంకు చక్ర సహిత దాసాంజనేయ స్వామి వారి ఆలయం సత్తుపల్లి రోడ్డు నందు కూడా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వందలాది మందికి అన్న ప్రసాద వితరణ ద్వారా సేవ చేసుకునే అవకాశం అంటే దేవుని ఆశీస్సులతో తాము ముందుకు వెళుతున్నామని మమ్ములను నడిపించేది ఆ దేవ దేవుడేనని వారు చెప్పారు.

# అయ్యప్ప స్వామి గుడిలో అన్నదానం



**తిరువూరు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** జయకృష్ణ హాస్పిటల్ అధినేత ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వర స్వామి ఆధ్వర్యంలో హరిహరశతుడు మణికంఠుడు అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి మాల ధారణ వేసుకున్న స్వాములకు మరియు భవాని స్వాములకు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి మాల ధారణ స్వాములకు అన్నదానం నిర్వహించారు డాక్టర్ నాగేశ్వర స్వామి దంపతులు స్వయంగా వడ్డించారు అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు డాక్టర్ నాగేశ్వర స్వామి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలు అందించారు

# 'బాల ఉత్సవ్' లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ




**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** పట్టణములో నిర్వహించిన 'బాల ఉత్సవ్' కార్యక్రమము నందు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, జానపద నృత్యం, కూచిపూడి నృత్యం మరియు కోలాటం మొదలైన విద్య, సాంస్కృతిక పోటీలలో విశ్వభారతి విద్యార్థులు పాల్గొని అధిక సంఖ్యలో బహుమతులు కైవసం చేసుకున్నారు. విశ్వభారతి పాఠశాల వ్యవస్థాపకులు పొట్లూరి శ్రీమన్నారాయణ బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు.

# మొక్కలు నాటిన సేవాతత్పరాలు విజయ కుమారి



**విజయవాడ, డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ వివేకానంద స్కూల్లో సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోండా ఉమ ఆదేశానుసారం డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకరాలు అవుటుపల్లి విజయ కుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డి పద్మావతి పి ఐ టి , ఇన్చార్జి హెచ్ఎం బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఇంటి కన్నా ఎక్కువ!




**విస్సన్నపేట,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ 1949 వ సంవత్సరంలో నాడు స్థల దాత కావలి శంకరరావు కుటుంబీకులు స్థలాన్ని ఇస్తే చలసాని వెంకటేశ్వరరావు, గుత్తా శివ సుబ్రహ్మణ్యం కుటుంబీకులు ఆర్థిక చేయూత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆనాడు వారి దాతృత్వం వలనే ప్రస్తుత ఖమ్మం జిల్లాలోని భరణిపాడు కందుకూరు వేంసూరు ప్రస్తుత ఏలూరు జిల్లాలోని పోలవరం చిన్నంపేట శివాపురం చాట్రాయి చనుబండ విస్సన్నపేట మండలం తో పాటు రెడ్డిగూడెం మండలం ఏ కొండూరు మండలం వాసులు కూడా నడిచి వచ్చే వాళ్ళు కొందరైతే సైకిల్ పై విద్యార్జనకు వచ్చేవాళ్ళు మరికొందరు ఆనాటి నుండి ఈనాటి వరకు ఉంటూనే ఉన్నారు. 83 సంవత్సరాలుగా వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు తరాలు మారిన వారి ఆలోచనలు ఆనాటి నుండి ఈనాటి వరకు మనబడి మన దేవాలయం అనే లక్ష్యంగా తమ సంపాదనలో కొంత భాగం హైస్కూల్ అభివృద్ధికి ఇచ్చే లక్ష్యంగా ముందుకు రావడం లక్షల రూపాయలకు పైగా పూర్వ విద్యార్థులు అయిన డాక్టర్ వెంకటేశ్వరరావు లయన్ జక్కవరపు రంగారెడ్డి వేసిన బీజం ఈనాడు హైస్కూల్ బయట డ్రైనేజీ బాగుపడటంతో పాటు హై స్కూల్ బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్ అడుగు ఎత్తు కొండ రాళ్లతో సిమెంట్ ఫ్లోరింగు తో గ్రానైట్ వేయడం జరిగింది. జిల్లా పరిషత్ హై స్కూల్ రూపురేఖలు మారకుండా వరండా తో పాటు ముఖద్వారా గేటు దిమ్మలకు కూడా గ్రానైట్ వేయడంతో పాటు రెండు వైపులా అరుగులు ఏర్పాటు చేయడం జరిగింది. వీటితోపాటు ఆటస్థల ప్రాంగణం బురదమయం కాకుండా గతంలో పోసిన మట్టిని తొలగించి నాణ్యమైన గ్రావిల్ తో నింపడం తో విద్యార్థిని విద్యార్థులు సీనియర్ సిటిజెన్లు పలు శాఖల ఉద్యోగులు ఆటలకు అనువుగా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు అందరికీ ఉపయోగపడుతుందని తెలుస్తోంది. ప్రస్తుత ప్రధాన ఉపాధ్యాయులు రంగా శోభారాణి పూర్వ విద్యార్థిని కావడంతో సొంత ఇంటి కన్నా ఎక్కువగా హైస్కూల్ పనులకే తమ సమయాన్ని కేటాయించడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. నైనానందకారంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన విస్సన్నపేట జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల శిఖలో మరి ఒక మణిమకుటం పీఎం శ్రీ బిల్డింగ్ అని చెప్పాలి. అతి త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ భవనంలో డిజిటల్ లైబ్రరీ కంప్యూటర్ సెంటర్ రసాయనిక భౌతిక వృక్ష శాస్త్ర ల్యాబ్ లను ఏర్పాటు చేయటం తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో భవనం 66 లక్షల రూపాయల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో తయారు కావడం నభూతో నా భవిష్యతి అన్నచ%శీ%దంగా ఉన్నదని సర్వత్ర అనుకుంటున్నారు.

# కె.వి.ఆర్ నర్సింగ్ విద్యార్థులు ఆన్ డ్యూటీ



**విస్సన్నపేట,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజీ నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు అవిన్య ఆసుపత్రిలో రోగులతో ఇంట్రాక్ట్ అయ్యారు. నర్సింగ్ కోర్సు నేర్చుకుంటూనే ఆసుపత్రులలో రోగులకు సేవలు అందించటం ఆత్మసంతృప్తినిస్తుందని విద్యార్థులు తెలిపారు. కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజీ నర్సింగ్ బోధన అధ్యాపకులు మాట్లాడుతూ నర్సింగ్ అనేది ఒక ఆరోగ్య సంరక్షణ వృత్తి అని ఇది సంరక్షణ కళ మరియు శాస్త్రాన్ని ఏకీకృతం చేస్తుందని ఆరోగ్యము మరియు మానవ పనితీరు యొక్క రక్షణ ప్రచారం అప్టిమైజేషన్ పై దృష్టి పెడుతుంది అన్నారు. అనారోగ్యం మరియు గాయం నివారణ వైజో తదితరాలను సొలుపు తరం చేయటం మరియు కరెంటుతో కూడిన ఉనికి ద్వారా బాధలను తగ్గించటం నర్సులు వివిధ స్థాయిల ధ్రువీకరణ మరియు బాధ్యతతో అనేక ప్రత్యేకతలతో ప్రాక్టీస్ చేస్తారని ఎక్కువ ఆరోగ్య సంరక్షణ వాతావరణంలో నర్సులు పెద్ద పాత్ర పోషిస్తారు అన్నారు. రోగులు రోగుల కుటుంబాలు మరియు ఇతర బృంద సభ్యులతో కలిసి పనిచేసే సంరక్షణ ప్రణాళికను అభివృద్ధి చేస్తారని ఇది జీవనం నాణ్యతను మెరుగుపరచడానికి అనారోగ్య చికిత్సపై దృష్టి పెడుతుందని చెప్పారు. వారి విధులు బాధ్యతలు పై సంపూర్ణ అవగాహన కల్పించారు. పలువురకు పరీక్షలు నిర్వహించారు. సమస్త వినేత కె.వి.ఆర్ పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే కార్యక్రమంలో భాగంగా ఇంటర్ విద్య తోపాటు ఒకేషనల్ విద్యను కూడా అందుబాటులోకి తెచ్చామని పోటీ పరీక్షలకు కోచింగ్ కూడా ఇవ్వటం తమ కాలేజీ ప్రత్యేకత అన్నారు. నర్సింగ్ కోర్స్ తో రోగుల సాధారణ మరియు ప్రత్యేక శ్రేయస్సును చూసుకోవటం దాని వలన వారి సామర్థ్యం తెలుస్తోందని ప్రతి దేశంలోని జాతీయ రాష్ట్ర లేదా ప్రాంతీయ చట్టాల ప్రకారం చట్టబద్ధమైన నిబంధనల పరంగా అర్హతల కొలమానం నర్సింగ్ విద్య అని హాస్పిటల్స్, క్లినిక్, ప్రయోగశాల, పరిశోధన, విద్య, గృహ సంరక్షణ తదితర ఉపాధి రంగాలలో అందుబాటులో పోస్టులు ఉంటాయని ఆయన చెప్పారు. ఆసుపత్రి అనేది ప్రత్యేక శాస్త్రం అని మరియు సహాయక ఆరోగ్య సంరక్షణ సిబ్బంది మరియు వైద్య పరికరాలతో రోగులకు చికిత్స అందించే ఆరోగ్య సంరక్షణ సంస్థ అత్యంత ప్రసిద్ధ ఆసుపత్రి జనరల్ ఆసుపత్రి తదితర విభాగాలలో బంగారు బాటలు వేసుకునేందుకు నర్సింగ్ విద్య ఒక సంజీవని అని కె.వి.ఆర్ తెలియజేశారు.

# విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకే బాలోత్సవం



**గన్నవరం,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో గన్నవరంలో బాలోత్సవం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో సోమవారం నాలుగవ బాలోత్సవం (పిల్లల పండుగ) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొడ్డు నాగేశ్వర రావు మాట్లాడుతూ మూఢ విశ్వాసాలను వ్యతిరేకిస్తూ విద్యార్థు లకు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నంలో బాగంగా ఈ బాలోత్సవం ఉద్దేశం అని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ పండుగ తోడ్పడుతుందన్నారు. "విద్యార్థులంతా ఒక్కటే, అందరం భారతీయులం" అనే భావజాలంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు మని అన్నారు. బాలోత్సవ కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు మాట్లాడుతూ ఈ ఉత్సవాన్ని గత మూడేళ్లు గా విజయవంతంగా నిర్వహిస్తున్నామని . గన్నవరంతో పాటు ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుండి వందలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు అని. ఈ నెల 12వ తేదీన ఈ ఉత్సవం జరగనుందని, ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థుల పేర్లను డిసెంబరు 8వ తేదీ నాటికి నిర్వాహకులకు సమర్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్ మరియు సబ్-జూనియర్స్ అనే విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని. ఈ పోటీలలో చిత్రలేఖనం, స్పాట్ డ్రాయింగ్, వ్యాసరచన, స్పెల్ బీ మ్యాప్, మెమరీ టెస్ట్, వక్తృత్వం, పద్యం-భావం, తెలుగులో మాట్లాడటం, కథ చెప్పడం, క్విజ్ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని సబ్-జూనియర్స్ విభాగంలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీకి పాఠశాల నుండి ఒక ప్రతినిధి మాత్రమే పాల్గొనవచ్చని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (ఇన్చార్జి) బి. శ్రీనివాసరావు మరియు ఇతర అధికారులు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలపాల్గొన్నారు.

# ఎటు చూసినా కల్తీ ఆహారమే



**తిరువూరు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** తిరువూరు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న రెస్టారెంట్లు..ఎటు చూసినా కల్తీ ఆహారమే.. ధన దహమే లక్ష్యంగా కొనసాగుతున్న వ్యాపారాలు.కల్తీ ఆహారం విక్రయాలపై కొరడా ఝళిపించాల్సిన అధికారులజాడ లేదు..అనారోగ్యానికి గురైన జీవాల మాంసాలతో వండిన మాంసాహార వంటకాలతో ఆహార ప్రియుల ఆరోగ్యాన్ని నట్టేట ముంచుతున్నారు. దుర్వాసన వెదజల్లే వంటశాలల్లోనే తయారీ చేస్తున్న వంటలు.తిరువూరు టౌన్, విస్సన్నపేట, గంపలగూడెం మండల కేంద్రాల్లో రుచి,శుభ్రతలేని కల్తీ ఆహారం రాజ్య మేలుతుంది. పుట్టినరోజు లేక ఏదైన సందర్భం పేరిట రెస్టారెంట్ల బాటపడుతున్న ఆహారప్రియులు.ఘుమఘుమలాడే సువాసనలతో ఆకట్టుకునేందుకు కలర్స్, రుచి కోసమంటూ చైనా సాల్ట్స్ వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని హరించేస్తున్నారు.దీంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతున్న పరిస్థితి దాపురించింది. ఒక తిరువూరులోనే సుమారు 10 వరకు రెస్టారెంట్లు ఉన్నాయి. ఇకపోతే వందల సంఖ్యలో ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, భోజనం,టిఫిన్ హోటళ్లు.. వాటి నిర్వహణకు అటూ ఫుడ్ కంట్రోల్, ఇటూ మున్సిపల్ అనుమతులు అసలు అలాంటివే ఉండవు.రెస్టారెంట్లు, హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు నాణ్యత లేక పోయినప్పటికి అధిక ధరలతో కస్టమర్ జేబులకు మాత్రం చిల్లులు వేస్తున్నారు. రెస్టారెంట్లలో వండి మిగిలిపోయిన మాంసాహారాలు ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సంపాదనే ధ్యేయంగా నాణ్యతలేని పదార్థాలు విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని పక్కన పెట్టి సొమ్ము చేసు కుంటున్న వ్యాపారస్తులు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రహదారుల్లో దాబాలు..లి ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రాజ్యమేలుతున్న కల్తీ ఆహారం.. ప్రజారోగ్యంపట్ల ఆహార తనిఖీలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్న ప్రజలు..

# ఏపీ లో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ

## -ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నపై కేంద్రం కీలక సమాధానం

**కాకినాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను విస్తరించేందుకు అవసరమైన కేంద్ర సహకారంపై దృష్టి సారిస్తూ,రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మంగళవారం సభలో ప్రశ్న లేవనెత్తారు. ఆయన ప్రశ్నకు స్పందించిన కేంద్ర ఆయుష్ శాఖ రాష్ట్ర మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ ప్రతాప్ రావ్ జాధవ్, దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న సమగ్ర క్యాన్సర్ కేర్ కార్యక్రమాలు, ఆంధ్రప్రదేశ్‌కు వాటి ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ఆధునిక వైద్యం, ఆయుష్ చికిత్సలను కలిపి రోగులకు సమగ్ర సహాయం అందించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం బలంగా ప్రోత్సహిస్తున్నదని. ఇందుకోసం కొట్టక్కల్ ఆర్య వైద్యశాల, ముంబై టాటా మెమోరియల్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయబడగా, ఎఐఐఎ- ఎయిమ్స్ ఝజ్జర్, గోవా మెడికల్ కాలేజ్‌లలో సంయుక్త పరిశోధన యూనిట్లు పనిచేస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశంతో ఆరోగ్యరంగంలో సమగ్ర వైద్య విధానాలపై రాష్ట్రం తీసుకుంటున్న చర్యలకు అనుకూలంగా,కే ంద్రం ఇచ్చిన సమాధానం రాష్ట్రానికి మరింత బలాన్నిచ్చేలా ఉంది. కృష్ణా జిల్లాలో సిసిఆర్ హెచ్,డిజిహెచ్ ఎస్ సంయుక్తంగా 2017%-2020 మధ్య అమలు చేసిన పైలట్ ప్రాజెక్ట్‌లో హోమియోపతి, యోగా పద్ధతులను ఎన్ పిసిడిసిఎస్ ప్రభుత్వ కార్యక్రమంతో కలిపి క్యాన్సర్ రోగులకు సాయం అందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో సమగ్ర చికిత్సకు మంచి పునాది వేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా తిరుపతిలో కొనసాగుతున్న సిద్ధ వైద్య పరిశోధన విభాగం స్విమ్స్ సంయుక్త కార్యక్రమం ద్వారా క్యాన్సర్ రోగులకు అందుతున్న సమగ్ర వైద్య సహాయాన్ని కూడా కేంద్రం ప్రశంసించింది. ఎంపీ సానా సతీష్ బాబు ఈ సమాధానంపై స్పందిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని జిల్లాలకు సమగ్ర క్యాన్సర్ చికిత్స సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమగ్ర వైద్యం రోగుల ఆరోగ్యానికి మాత్రమే కాదు, కుటుంబాలకు ధైర్యాన్ని ఇస్తుంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తాను అని వెల్లడించారు. పార్లమెంటులో చర్చ వల్ల ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను వేగంగా విస్తరించే మార్గాన్ని సృష్టిస్తోందని ఆరోగ్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# మానవ సంబంధాలు మెరుగు పరచేందుకు "లోక్ అదాలత్" ను సద్వినియోగం చేసుకుందాం

## -న్యాయ వాదులకు జిల్లా అదనపు జడ్జి ఏ.సత్యానంద్ పిలుపు




**విజయవాడ లీగల్,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** డిసెంబర్ 13 న "మెగా లోక్ అదాలత్" జరగనున్నందున రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీ ఏ సత్యానంద గారు బెజవాడ బార్ అసోసియేషన్ కి విచ్చేసి లోక్ అదాలత్ వలన ఆవశ్యకతను న్యాయవాదులకు తెలియజేశారు. అదే విధంగా కోర్టులలో రోజు రోజుకి కేసులు పెరిగిపోతున్నందున న్యాయవాదులు సహకరించి, వారి కక్షిదారులను సమాధానపరాచి వారి మధ్య సఖ్యతను కుదిర్చి కేసులను పొడిగించకుండా లోక్ అదాలత్ లో రాజీ చేయాలని న్యాయవాదులను కోరారు. వీటి వలన మానవ సంబంధాలు మెరుగుపడతాయని నవ సమాజాన్ని నిర్మించవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కమర్షియల్ కోర్టు జడ్జి శ్రీ భూపాల్ రెడ్డి గారు, 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీ సునీల్ కుమార్ గారు మరియు బెజవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు శ్రీ ఏకే భాషా గారు హాజరయ్యారు.

# నీటి సరఫరాతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

## -డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్



**నందిగామ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** గత నెల మోంతా తుఫాన్ కారణంగా ఎన్నో ఎకరాల పంటలు నాశనం అవటం వల్ల రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారని డిసి ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ ఆవేదన వెలిబుచ్చారు. మంగళవారం కూటమి నాయకులు రైతులకు రైతులతో కలిసి చంద్రశేఖర్ దెబ్బతిన్న పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రత్తి సాగు చేసే రైతులు పత్తిని పీకి దుక్కి దున్ని శనగ,మినుమో, మొక్కజొన్న వేసుకోవడానికి తగిన నీటి కొరత ఉన్నందున కేతవీరునపాడు, ఐతవరం,అంబారుపేట, మునగచర్ల, హనుమంతుపాలెం రైతులు శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య సహకారంతో గత 20 సంవత్సరాలుగా ఎన్నడు లేని విధంగా చివరి ఆయకట్టుకు నీరు అందిందని రాటకొండ చంద్రశేఖర్ హర్షం వెలిబుచ్చారు.ఆ నీటితో రైతులు పత్తిని పీకి వేరే పంటను వేయటానికి కూటమి ప్రభుత్వ కృషి చేసిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమయానికి నీరు అందించటం చాలా సంతోషంగా ఉందని రైతుల మన్నలను పొందుతూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామని తెలిపారు.వేదాద్రి ఎత్తిపోతల పథకం గనుక పూర్తి అయితే రైతులకు చాలా మేలు జరుగుతుందన్నారు. దీనికి పూర్తి సహకారం అందించిన ఆయా గ్రామాల రైతులకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పి సిబ్బంది మన్నెం శ్రీనివాసరావు,రామిరెడ్డి శ్రీనివాసరావు, ఎన్ఎస్పి వర్కింగ్ ప్రెసిడెంట్ స్వతంత్రరావు,రమేష్ తదితరులు పాల్గొన్నారు

# తిరువూరు బాలోత్సవం(4వ పిల్లల పండుగ) గోడపత్రికను ఆవిష్కరించిన ఆర్డీవో కె.మాధురి



**తిరువూరు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** జనవరి 3వ తేదీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న నియోజకవర్గ స్థాయి తిరువూరు బాలోత్సవం 4వ పిల్లల పండుగ గోడపత్రికను ఈరోజు తిరువూరు డివిజన్ RDO కె.మాధురి వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడం,వారిఅభిరుచులను,ఆసక్తులను ప్రోత్సహించేందుకు బాలోత్సవాలు ఎంతో దోహదం చేస్తాయని తెలియచేశారు. 24 అకడమిక్,8 సాంస్కృతిక విభాగాలలో మొత్తం 32 రకాల పోటీలు జరుపుతున్నట్లు బాలోత్సవ కమిటీ సభ్యులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు కె.పాపారావు, నాగమల్లేశ్వరావు,పాకాల.రామకృష్ణ, కె.వి.ఆర్.ఆంజనేయులు, యస్.డి.సుభాని తదితరులు పాల్గొన్నారు

# స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో 5 వ వార్డ్ బడ్డీకొట్టు,వాటర్ కూలర్ వితరణ



**హనుమాన్ జంక్షన్,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లోని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక నూజివీడు రోడ్ లో నివాసం ఉంటున్న నిరుపేద కొప్పాక సాంబ సత్యనారాయణ కుటుంబానికి బడ్డికొట్టు అందజేశారు. అలాగే హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు కూలర్ అందించారు. ఈ కార్యక్రమాల్లో కడగల శ్రీనివాసరావు, వీరమాచినేని బుజ్జి, గొట్టాపు వాసు,పర్వతనేని నాగేశ్వరరావు, ఏ ఎస్ ఐ పెద్దిరాజు, కొప్పాక సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

# నేడే సాంస్కృతిక సంబరం..కళల సౌరభం

**'ఉద్భవ్-2025'కు సర్వం సిద్ధం**

**3 రోజుల పండుగకు తరలివచ్చిన అడవి బిడ్డలు**

**పోటీలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వ ఏర్పాట్లు**

**అమరావతి, డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మరో అద్భుతమైన వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదిక కాబోతోంది. గిరిజన విద్యార్థుల ఆటపాటలు, వారి సంస్కృతి సంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేయనున్నాయి. అడవిబిడ్డలలో దాగి ఉన్న ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు 'ఉద్భవ్-2025' సిద్ధమైంది. గిరిజన సంస్కృతి, కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా అమరావతి రాజధానిలోని కేఎల్ యూనివర్శిటీలో మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్** జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎమ్ఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో జరగడం తొలిసారి. బుధవారం ఉదయం 10గం.లకు అట్టహాసంగా ప్రారంభమయ్యే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ హాజరవుతున్నారు. విద్యార్థుల పోటీల కోసం మొత్తం 12 వేదికలను సిద్ధం చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు సంబంధించి ఏకంగా 35 విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. నాటకాలు, గాత్ర సంగీతం, వాయిద్యం, జానపద సంగీతం, భక్తి, దేశభక్తి, నృత్యం, లలిత సంగీతం, క్విజ్, సాంప్రదాయ గిరిజన నృత్యం వంటి విభాగాల్లో ప్రతిభ చూపేందుకు చిన్నారులు ఉత్సాహం కనబరుస్తున్నారు.

**తరలివచ్చిన మినీ భారతం** గిరిజన ప్రాంతాల పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశం. ఇది గిరిజన బిడ్డలకు దక్కిన అద్భుతమైన అవకాశం. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేందుకు దాదాపు 22 రాష్ట్రాల నుంచి 1800పైగా చిన్నారులు తరలివచ్చారు. డిసెంబర్ 3,4,5 తేదీలలో మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులు తమ ప్రతిభ చాటనున్నారు. మన రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది ప్రతిభావంతులు కూడా తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించేందుకు సమాయత్తమయ్యారు.

**తొలిరోజు కార్యక్రమాలివే..** అంగరంగ వైభవంగా నిర్వహించనున్న 6వ జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎమ్ఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలకు కేంద్ర మంత్రులు సహా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఛైర్ పర్సన్ లు, ఐఏఎస్ లు పాల్గొననున్నారు. తొలిరోజు కార్యక్రమం.. ముందు అతిథులను వేదికపై ఆహ్వానించిన అనంతరం ప్రారంభ గీతంతో మొదలవుతుంది. గిరిజన శాఖకు చెందిన కార్యదర్శి, కమిషనర్ ల ప్రారంభోపన్యాసాలు ఉంటాయి. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రసంగిస్తారు. అనంతరం కేంద్ర మంత్రి ఓరమ్ కీలకోపన్యాసం ఉంటుంది. అనంతరం వేదికపైకి వచ్చిన అతిథులకు చిరుసన్మానం, పురస్కార ప్రదానం ఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో తొలిరోజు ఉత్సవం ముగుస్తుంది.

**ప్రత్యేకాకర్షణగా మస్కట్ 'క్రిష్'** గిరిజన సంస్కృతి చాటే విధంగా, రాష్ట్ర జంతువు కృష్ణజింకను మస్కట్ గా ఎంపిక చేశారు. ఇప్పటికే 'క్రిష్'గా మస్కట్ పేరును ఖరారు చేశారు. శుక్రవారం నాడు సాయంత్రం 5గం.లకు ముగింపు వేడుకలు జరుగుతాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆఖరి రోజున ఘనంగా సన్మానించి, ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు.

# కళలు కలకాలం నిలవాలి..

**- భావితరాలకు వారసత్వ సంపదగా అందాలి**

**- కళలు, కళాకారులకు ప్రభుత్వం నుంచి గొప్ప ప్రోత్సాహం**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే ప్రపంచ తెలుగు కవులు, రచయితల మహా సభలకు జిల్లా అధికార యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, కళలు కలకాలం నిలవాలి.. గెలవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28వ తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రపంచ తెలుగు కవులు, రచయితల మహా సభల విజయవంతానికి చేయూత నివ్వాల్సిందిగా ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పొట్లూరి హరికృష్ణ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతి సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 1500 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంతో పాటు అయిదు వేదికలపై సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కవులు, రచయితలు తమ కళా నైపుణ్యంతో అక్షర సత్యాలతో దేశ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారని.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, కళా సంపదను భావితరాలకు వన్నె తగ్గని సంపదగా అందించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిఒక్కరికీ, ప్రతి సంస్థకు ప్రభుత్వ పరంగా సహాయసహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. మహా సభల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక, సాంస్కృతిక శాఖ సహకారం ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# ఉన్నది ఒకటే కుళాయి కనెక్షన్

**-రికార్డుల్లో రెండు కుళాయి కనెక్షన్ లుగా నమోదు చేశారు.**

**- పైగా రెండు కుళాయి కనెక్షన్లకు పన్ను చెల్లించాలంటున్నారు.**

**సమస్య పరిష్కరించాలని కమిషనర్ అలీం బాషాకు వినతి**

**మంగళగిరి:డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తన నివాస గృహానికి సంబంధించిన తాగునీటి కుళాయి కనెక్షన్ సమస్యను పరిష్కరించాలని నగరంలోని కొత్తపేటకు చెందిన ఎండీ సలీమ్ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని కొత్తపేటలో ఉన్న తన నివాస గృహానికి వాస్తవానికి ఒకే ఒక్క తాగునీటి కుళాయి కనెక్షన్ (అసెస్ మెంట్ నెంబరు: 1023000642) ఉందని, కానీ నగరపాలక సంస్థ రికార్డుల్లో తనకు రెండు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ సమస్య ఉండటంతో తాగునీటి కుళాయి పన్ను కూడా చెల్లించుకోవడం లేదని తెలిపారు. అదనంగా నమోదైన కుళాయి కనెక్షన్ రద్దు చేసి వాస్తవంగా ఉన్న తాగునీటి కుళాయి కనెక్షన్ కు సంబంధించి బిల్లు చెల్లిస్తామని చెబుతుంటే సచివాలయ అధికారులు మాత్రం రెండు కుళాయి కనెక్షన్లకు సంబంధించిన బిల్లు చెల్లించాల్సిందేనని చెబుతున్నారని తెలిపారు.

# డివిజన్ లో మౌలిక సదుపాయాలు కల్పన త్వరితగతిన పూర్తి చేయండి

**పాద యాత్ర లో అధికారులను ఆదేశించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 2 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ విస్తృతంగా పర్యటించారు. .గచ్చిబౌలి విలేజ్ స్ట్రీట్ నెం.2 నుండి ఇందిరానగర్ వరకు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ భాస్కర్,వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ కుమార్ మరియు స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి, సమస్యలను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అడిగి తెలుసుకున్నారు.గచ్చిబౌలి విలేజ్ లో డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు ఆదేశించి తగిన చర్యలు చేపట్టమన్నారు.అలాగే మిగిలిన సిసి రోడ్ల పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ఇరిగేషన్ అధికారులతో కలిసి వెంకటేశ్వరా కాలనీ,మస్జీద్ బండ తదితర ప్రాంతలలో పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువుల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా చాకలి చెరువు,గోపిచెరువులలో మురుగు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుర్వాసన విపరీతంగా ఉంటుందని డ్రైనేజీ నీరు చెరువులో కలువకుండా వేరుగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని, గోపిచెరువు,చాకలి చెరువుల సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేస్తే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డివిజన్ లో మిగిలిన సిసి రోడ్లను సైతం నిర్మాణం చేపట్టనున్నట్లుగా తెలిపారు.ఇవే కాకుండా అభివృద్ధి పనులను చేపట్టి ఇతర అన్ని రకాల సమస్యలను పరిష్కరించనున్నట్టుగా చెప్పారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ ఈఈ శిరీష,డిఈ ఆనంద్,ఇరిగేషన్ డిఈ రాజశేఖర్,ఏఈ భాస్కర్,వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ కుమార్,డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్,గచ్చిబౌలి విలేజ్ ప్రెసిడెంట్ సయ్యద్ నయీమ్,అఫ్జల్, మైమూద్,సత్తార్,సత్యనారాయణ,ఫరీద్,ముకేశ్ సింగ్,భాను ప్రకాష్,శివ,ఇబ్రహీం,ప్రవీణ్, నదీమ్,గణేష్,రాజు వెంకటేశ్వరా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# ఏకగ్రీవ దిశగా దొనకొండ గ్రామపంచాయతీ

**దొనకొండ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల శ్రావణి సురేష్**





**దంతాలపల్లి,డిసెంబర్ 2(వార్తా ప్రభ)** స్థానిక మండలం దొనకొండ గ్రామపంచాయతీ ఏకగ్రీవ దిశగా అడుగులు వేసింది.గ్రామపంచాయతీలో సర్పంచి ప్రథమ పౌరుడు ఒకసారి ఎన్నికైతే ఐదేళ్లపాటు ఆ హోదాతో పాటు ప్రోటోకాల్ ప్రకారం పంచాయతీలో నిర్వహించే చిన్న సమావేశం నుంచి ప్రభుత్వపరమైనసభలకు సమావేశాలకు అతనికి ప్రాధాన్యం ఇస్తారు.ఇంతటి ప్రాధాన్యం ఉన్న స్థానం సాధించడానికి అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల్లో నిలుచుంటారు. అయితే దంతాలపల్లి మండలంలో దొనకొండ గ్రామపంచాయతీ ఓటర్లు మాత్రం సర్పంచ్ ఎన్నిక మాత్రం ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ముందుకు అడుగు వేస్తున్నారు. గ్రామాల్లో ఇద్దరు ముగ్గురు నామినేషన్లు వేసి బరిలోఉండి డబ్బు, మద్యం ఖర్చుపెట్టి, కొన్ని కుటుంబాల మధ్య గొడవలకు దారిదీసి, ఓడిపోయిన కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు కోకొల్లలు అలాంటి బాధపడటం ఇష్టం లేదని, ఓటును మందు,డబ్బుకు అమ్ముకోకుండా ఆదర్శంగా ఉండాలని ఉద్దేశంతో గ్రామంలో ఏదో ఒక అభివృద్ధి పనిని చేపట్టేటువంటి వ్యక్తికి మద్దతు ఇచ్చి ఏకగ్రీవం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుండి వచ్చేటువంటి నిధులు కూడా గ్రామానికి వస్తాయని వినూత్నంగా గ్రామ ప్రజలు ఆలోచిస్తున్నారు. గ్రామస్తులందరూ సమావేశమై గ్రామాల అభివృద్ధిపై చర్చించి ఎలాంటి గొడవలు లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పోటీ లేకుండా ఒక్కొక్కరిని నామినేషన్లు వేస్తూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి కృషి చేస్తున్నారు. మండలంలోని దొనకొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆవుల శ్రావణి సురేష్ ని సర్పంచి అభ్యర్థిగా ఏకగ్రీవం కొరకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకుగ్రామాల్లో సర్పంచ్, వార్డులకు సంబంధించి సైతం ఒక్కొక్కరే సభ్యులు నామినేషన్ వేయడం విశేషం.

# లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రాణహిత ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్

**బుక్,కలర్ పెన్సిల్ కిట్ ల పంపిణీ**



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 2 : (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ లోని మియాపూర్ న్యూ కాలనీ లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ అఫ్ ప్రాణహిత వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అఫ్ ప్రాణహిత ఎస్.ఉషశ్రీ రెడ్డి సహకారంతో విద్యార్థులకు ఉచితంగా డ్రాయింగ్ బుక్,కలర్ పెన్సిల్ కిట్ ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని డ్రాయింగ్ బుక్,కలర్ పెన్సిల్ కిట్ లయన్స్ క్లబ్ 320డి డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ.అమర్ నాథ్ రావు,వి.డి.జి విజయలక్ష్మి,పి.డి.జి జి.శ్రీనివాస్,ఎస్.ప్రతాప్ రెడ్డి,మ్రి.ప్రవీణ్,లయన్స్ సభ్యులు 100 మంది విద్యార్థులకు ఉచితంగా డ్రాయింగ్ బుక్,కలర్ పెన్సిల్ కిట్లను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు.విద్య అనేది సామాజిక స్థిరత్వాన్ని ప్రోత్సహించే ఒక శక్తివంతమైన మార్గమని ఉన్నత విద్యతో దేశాభివృద్ధికి తోడ్పడవచ్చని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి,వారి భవిష్యత్తుకు తోడ్పడటానికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ లయన్స్ క్లబ్ 320డి గవర్నర్ అమర్ నాథ్ రావు,లయన్స్ క్లబ్ అఫ్ ప్రాణహిత అధ్యక్షులు జి.మల్లికార్జున్,బి.శ్రీనివాస్ ముదిరాజ్,ఎం.రాజు,బి.మహేందర్ ముదిరాజ్,కృష్ణయ్య,బి.ఎస్.ఎన్.కిరణ్ యాదవ్,విజయలక్ష్మి ,ప్రవీణ్,డి.లక్ష్మి,పద్మావతి,నారాయణ గౌడ్,అశోక్ గౌడ్,జనార్దన్ రెడ్డి,సుధీర్, నర్సింలు,కరుణాకర్, రీజియన్ ఛైర్మెన్ రమణ,మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నవిల ప్రవీణ్ నామినేషన్ దాఖలు





**దంతాలపల్లి డిసెంబరు2 (వార్తా ప్రభ)** స్థానిక మండలం వేములపల్లి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నవిల ప్రవీణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... తనను గెలిపిస్తే గ్రామంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. ప్రజలు నన్ను సర్పంచ్ గా ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులుగుండ గాని యాకయ్య కుర్యవుల గణేష్ గంధసిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 02(వార్తా ప్రభ)** గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. బోయినపల్లి లోని ఆర్ఓ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ తోపాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. బోయినపల్లి జడ్పీ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓ కు సూచనలు చేశారు.

**లారీలు అందుబాటులో ఉండాలి** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర లారీలు అందుబాటులో ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, తూకం తనిఖీ చేశారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన టార్పాలిన్, వసతులు కల్పించాలని సూచించారు.

# హైదరాబాద్

## ప్రపంచ తెలుగు మహాసభలకు వేము.. వందనం కు ప్రత్యేక ఆహ్వానం..



**హైదరాబాద్ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సాహిత్య కళా భూషణ్, శత సత్కారాల కళా తపస్వి డాక్టర్ వేము వందనం కి ప్రత్యేక గౌరవం దక్కింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్రప్రదేశ్ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2026 జనవరిలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకువేము సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులురచయిత, నటుడు, దర్శకులు,డా వేము వందనం అతిథి గాఆహ్వానం అందుకున్నారు. ఈసభలు 2026 జనవరి నెలలో 3,4,5 తేదీల్లో గుంటూరుపట్టణంలో జరగనున్నవి. ఈమహా సభలకు అతిథి గా ఆహ్వానించి నందుకు కార్యక్రమ నిర్వాహక అధ్యక్షులుడాక్టర్ గజల్ శ్రీనివాస్ కి, సమన్వయకర్తలు శ్రీమతి కొల్లు రమావతి కి మరియు పిరామచంద్ర రాజు కి వందనం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలుగుతల్లి కి డాక్టర్ గజల్ శ్రీనివాస్ బృందం చేస్తున్న సేవలకి డాక్టర్ వేము వందనం ప్రత్యేక వందనాలు తెలిపారు. అలాగే ఈ తెలుగు మహా సభలకు ప్రపంచం నలుదిక్కులా ఉన్న తెలుగు వారంతా హాజరై జయప్రదం చేయాలని వేము వందనం పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను 100 శాతం ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణాలను 100 శాతం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రకాష్ రావు లతో కలిసి కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టవలసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రతి లబ్ధిదారులు ప్రారంభించేలా మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి 498 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 391 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందని, మిగిలిన 107 మంది లబ్ధిదారులు పనులు చేపట్టలేదని తెలిపారు. ఇందుకు గల కారణాలను తెలుసుకొని పనులు ప్రారంభించేందుకు మెప్మా క్రింద మహిళ సంఘాల నుండి రుణ సదుపాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 458 ఇండ్లు మంజూరు కాగా ఇంకా 1505 ఇండ్లను ప్రారంభించలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ నెల 20వ తేదీలోగా పూర్తి అయిన ఇండ్లకు ప్రారంభోత్సవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ధర్మారావుపేట గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం

**25 ఏళ్ల తర్వాత ఏకగ్రీవం**

**బెల్లంపల్లి డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో రెండో దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న వేళ, కాసిపేట మండలంలోని ధర్మారావుపేట గ్రామం ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. ప్రజల సమస్యలు అర్థం చేసుకునే నాయకత్వం గ్రామానికి ఉపకరిస్తుందని నమ్మిన గ్రామస్థులుఒక్కటే నామినేషన్ దాఖలు అయ్యేలా ఏకమై 25 సంవత్సరాల తర్వాత సర్పంచ్, రెండు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వగ్రామమైన ఈ గ్రామంలో ఆయన వర్గానికే చెందిన జుగునాక రాధ మనోజ్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వార్డు సభ్యులుగా పార్వతి పద్మపెద్దిరాజు, ఆజ్మీర శ్రీవల్లి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు చేయడంతో వారు కూడా ఏకగ్రీవ సభ్యులుగా నిలిచారు."గ్రామస్థులు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను నా శక్తి మేరకు గ్రామాభివృద్ధికే శ్రమిస్తాను" అని ఏకగ్రీవ సర్పంచ్ జుగునాక రాధ మనోజ్ తెలిపారు.గ్రామంలో శాంతియుత ఏకగ్రీవ వాతావరణాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావుకు గెలిచిన అభ్యర్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## జర్నలిస్టుల సంక్షేమం కోసం అన్ని యూనియన్ లు కలిసి పోరాటాలు చేయాలి

***టీజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా***

**హుజూర్ నగర్ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు, తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సలహాదారు ఉప్పల లక్ష్మణ్ సూచన మేరకు టిజేఏ రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకటరమణారావు,రాష్ట్ర కార్యదర్శి ఘోరీ,ఎన్ యూ జే ఐ ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ ఆదేశాల మేరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సమాచార శాఖ కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ చేయనున్న ధర్నాకు మద్దతుగా తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టి జే ఏ)కూడా పాల్గొని ధర్నాను విజయవంతం చేయనున్నామని టీజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడేషన్,హెల్త్ కార్డ్స్,ఇన్సూరెన్స్,బస్ పాసులు,ట్రైన్ పాసులు,ఇండ్ల స్థలాలు,ఇండ్లు తదితర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం లభించాలని టి యూ డబ్ల్యూ జే చేయతలపెట్టిన ధర్నాకు అన్ని సంఘాల నాయకులు పాల్గొని జర్నలిస్టుల సంక్షేమం కోసం అన్ని యూనియన్ లు కలిసి పోరాటాలు చేసినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కరించబడతాయని ప్రభుత్వాలు స్పందించే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన అన్నారు సూర్యాపేట జిల్లా లోని అన్ని మండలాల టి. జే.ఏ.అధ్యక్షులు కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# ఎడిటోరియల్

## ఆ 'నాలుగు'.. వైసీపీ వదిలేసుకోవడమే.. !

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైసీపీకి పలు జిల్లాల్లో మెజారిటీ దక్కడం ప్రశ్నార్థకంగానే మారింది. ముఖ్యంగా కీలక నియో జకవర్గాల్లో జెండామోసే నాయకుడు, పార్టీ వాయిస్ వినిపించే నేత కూడా కరువయ్యారు. దీంతో అలాంటి నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితి ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బలమైన నియోజకవర్గాలుగా పేరున్న కొన్ని స్థానాల్లో వైసీపీ గెలుపు మాట ఎలా ఉన్నా.. పూర్వ ప్రాభవం దక్కించుకోవడం కూడా కష్టమన్న వాదనా వినిపిస్తోంది. ఇలాంటి వాటిలో నాలుగు నియోజకవర్గాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. వీటిలో రెండు స్థానాలను వైసీపీ ఇప్పటికీ బోణీ కొట్టలేక పోయింది. పశ్చిమ గోదావరి(ఉమ్మడి) జిల్లాలోని పాలకొల్లు నియోజకవర్గంలో వైసీపీ జెండా కనిపించడం లేదు. వైసీపీ మాటా వినిపించడం లేదు. పైగా ఇక్కడ పార్టీ ఇప్పటి వరకు బోణీ కూడా కొట్లలేదు. 2014, 2019, 2024 ఎన్నికల్లోనూ వరుసగా నిమ్మల రామానాయుడు విజయం దక్కించుకున్నారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నా.. మంత్రిగా ఉన్నా.. సామాన్యులకు చేరువగా ఉండడం ప్రధానంగా కలిసి వస్తోంది. దీనికితోడు వైసీపీ తరఫున బలమైన గళం వినిపించేవారే లేకుండా పోయారు. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలిలోనూ వైసీపీ ఇప్పటి వరకు బోణీ కొట్టలేదు. అనేక ప్రయత్నాలు చేసినా.. అవేవీ ఒక్క పారలేదు. పైగా.. ఇక్కడ రాజకీయం వైసీపీకి మరింత తలనొప్పిగా మారింది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వ్యవహారా లు వైసీపీకి తలనొప్పిగా మారి.. రాజకీయంగా ఇబ్బందులు తెచ్చాయి. ఇప్పటికీ అదే పరిస్థితి నెలకొంది. ఇక, టీడీపీ తరఫున వరుస విజయాలు అందుకున్న అచ్చెన్నాయుడు ఇప్పటికి రెండు సార్లు మంత్రిగా ఉన్నారు. సామాన్యులకు చేరువగా ఉంటూ.. పార్టీలో ఐక్యతకు పెద్దపీట వేస్తున్న అచ్చెన్నకు మరోసారి కూడా తిరుగులేదన్న వాదన వినిపిస్తోంది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన వైసీపీ ఇప్పుడు మంగళగిరిలో అజా అయిపు లేకుండా పోయింది. ఆళ్ల రామకృష్ణా రెడ్డి ఉన్నప్పుడు.. మంగళగిరి వైసీపీకి బాగానే హవాను తీసుకువచ్చింది. కానీ, గత ఎన్నికలకు ముందు జరిగిన నాటకీయ పరిణామాలు.. ఆళ్ల రాజీనామా-చేరిక.. తర్వాత జరిగిన అనేక ప్లస్సులు-మైనస్‌లు వైసీపీని తీవ్ర ఇరకాటంలోకి నెట్టాయి. ఇక, మంత్రి నారా లోకేష్ 90 వేల ఓట్ల మెజారిటీ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇక, గత 17 మాసాలుగా జరుగుతున్న అభివృద్ధి కూడా ఇక్కడ వైసీపీకి కేరాఫ్ లేకుండా చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఉండి నియోజకవర్గంలోనూ వైసీపీకి ఏ మాత్రం పట్టు చిక్కడం లేదు. 2014, 2019, 2024 ఇలా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోయింది. గత ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ నుంచి పోటీ చేసిన ఫైర్‌బ్రాండ్ లీడర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు ఘనవిజయం సాధించడంతో పాటు పాగా వేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక్కడ గత రెండు ఎన్నికల్లోనూ ఓడిపోయిన సీవీఎల్. నరసింహారాజు ఇప్పుడు వయోః భారంతో రాజకీయాలు చేసే పరిస్థితి లేదు. ఆయన తర్వాత బలమైన ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా లేదు. ఏదేమైనా ఈ కీలక నియోజకవర్గాల్లో అసలు వైసీపీ జెండా పట్టి ముందుండి నడిపించే నాథుడే లేని దుస్థితి.

## కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలి

**మైలవరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొండపల్లి జనసేన నాయకుల అర్జీ**



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి ):**కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని మైలవరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొండపల్లి జనసేన నాయకుల అర్జీ సమర్పి ంచారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ,జనసేన పార్టీ ఇంచార్జి అక్కల గాంధీ లు ఈ ప్రజా వేదికలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ జనసేన పార్టీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్ అర్జీ సమర్పించారు. అర్జీలో స్కూల్లో క్రీడామైదానం అభివృద్ధి,పిల్లలకు ఆర్ వో ప్లాంట్ ద్వారా మంచినీరు సదుపాయం కల్పించాలని కోరారు. అదేవిధంగా కొండపల్లికి ఐటిఐ కాలేజ్,కేంద్రియ విద్యాలయం కేటాయించాలని కోరారు. సానుకునిగా స్పందించని ఎమ్మెల్యే మరియు కలెక్టర్‌త్వరలోనే సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

## విలువైన సూక్తులు



మంచివారి స్నేహము
జీవితాన క్షేమము
ఎన్నడూ వదలుకోకు
నష్టము తెచ్చుకోకు
బుసకొట్టే కోపము
శత్రువు ప్రతిరూపము
అపాయము తెచ్చునోయ్!
దూరము ఉండాలోయ్!
ఎవ్వరినీ హేళన
చేయరాదు చులకన

హుందాగా ఉండాలి
ఆదర్శం పండాలి
ఒక్కింత మంచితనము
ఉంటేనే జీవితము
లేదంటే మాత్రము
గడ్డితో సమానము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు సెల్:9966 414580

# ముందు జాగ్రత్తలే నేటికీ ఎయిడ్స్ మందు

**డాక్టర్ టి .సేవ కుమార్ అధ్యక్షులు ఐఎంఏ గుంటూరు శాఖ**




**గుంటూరు టౌన్ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్ (హెచ్ఐవి) ద్వారా సంక్రమించే ఎయిడ్స్ వ్యాధికి నేటికీ పూర్తిగా నయం చేసే మందులు ఏవి లేవని వైరస్ వ్యాప్తి చెందే విషయంలో ముందు జాగ్రత్తలే ఇప్పటికీ మందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నిరోధక దినోత్సవం సందర్భంగా ఐఎంఏ గుంటూరు శాఖ, అపెక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు సంస్థలో నిర్వహించిన హెచ్ఐవి -ఎయిడ్స్ శాస్త్రీయ అవగాహన సభలో డాక్టర్ టి. సేవకుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సేవకుమార్ ప్రసంగిస్తూ ఎయిడ్స్ కారక హెచ్ఐవి లౌంగిక సంపర్కం ,రక్త మార్పుడులు, టాటూ మార్కుకు వాడే సూదులు, మాదక ద్రవ్యాల బానిసలు స్టెర లైజ్ చేయకుండా ఒకరి సూదులు మరొకరు వాడటం ద్వారా ఎక్కువగా హెచ్ఐవి వ్యాప్తి చెందుతుందన్నారు. గత రెండు దశాబ్దాలుగా బాగా తగ్గి పోయినది ఆనుకున్న ఎయిడ్స్ వ్యాధి నేడు మళ్ళీ వ్యాప్తి పెరుగుతోందన్నారు. హెచ్ఐవి సోకిన వారిలో శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందన్నారు. ఫలితంగా సమయానుకూల వ్యాధులు విజృంభించి మరణానికి కారణమవుతున్నాయన్నారు. హెచ్ఐవి సోకిన వారిలో లింక్ గ్రంథాల వాపు ,నెలల తరబడి తగ్గని జ్వరం, విరోచనాలు బక్క చిక్కి పోవటం ,ఆకలి లేకపోవడం ,దగ్గు ,ఆయాసం వంటిలక్షణాలు ఉంటాయన్నారు .వైరస్ ప్రత్యక్షంగా మరణానికి కారణం కాదని , శరీరంలో రోగ నిరోధక శక్తిని నాశనం చేయడం వల్ల బ్యాక్టీరియల్, వైరల్ ,ఫంగల్ ,పారాసైటిక్ సమయానుకూల వ్యాధులు మరణానికి కారణం అవుతున్నాయి అన్నారు. హెచ్ఐవి ని కొన్ని రకాల రాపిడ్ పరీక్షల ద్వారా స్క్రీనింగ్ చేసి ,ఆ పరీక్షలలో హెచ్ఐవి ఉందని వచ్చిన వారికి పిసిఆర్ పరీక్ష చేయడం ద్వారా హెచ్ఐవి ని నిర్ధారించవచ్చునన్నారు. ఎయిడ్స్ లక్షణాలు బయటపడకముందే హెచ్ఐవి సంఖ్యాభివృద్ధిని నియంత్రించే యాంటీ రెట్రో వైరల్ థెరపీ(ఏ ఆర్ టి) మందులు జీవితాంతం వాడాల్సి ఉంటుందన్నారు .ఈ మందులు చాలా ఖరీదైనవి ఆ న్నారు .అయితే ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ ఆర్ టి క్లినిక్స్ ద్వారా బాధితులకు ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు .మళ్ళీ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతే చికిత్సకు దేశంలో, రాష్ట్రాల్లో నిధుల కొరత వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇదివరకులా ఇప్పుడు మన దేశానికి ఎయిడ్స్ నియంత్రణకు నిధులు విదేశాల నుండిరావడం లేదన్నారు . హెచ్ఐవి గలవారునైతిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇతరులకు తమ ద్వారా వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎయిడ్స్ కు నేటికీ వ్యాక్సిన్ లేదని అన్నారు. సభలో పాల్గొన్న ఎపె క్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ కె .నాగేశ్వరావు మాట్లాడుతూ దేశంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మళ్లీ పెరగటం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో అధికారక సమాచారం ప్రకారం మూడు లక్షలకు పైగా బాధితులు ఏ ఆర్ టి ని వినియోగిస్తున్నారని అన్నారు.ప్రజలందరూ హెచ్ఐవి వ్యాప్తి నిరోధంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సభలో పాల్గొన్న ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బి. సాయి కృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నిరోధముకు ప్రభుత్వంతోపాటు తమ వైద్యుల సంఘం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా కృషి చేస్తుందన్నారు .ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై శాస్త్రి అవగాహన పెంచుకొని నిరోధంకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరు శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ చిలకల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డి. అమర్ తదితరులు పాల్గొన్నారు . సభాంతరం ప్రేక్షకులు పలువురు అడిగిన సందేహాలకు ,ప్రశ్నలకు వైద్య బృందం సభ్యులు సమాధానాలు చెప్పారు. సందేహాలను నివృత్తి చేశారు.

## నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే క్రమంలో మీకేం అవసరమైన నిర్భయంగా చెప్పండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగర పారిశు ద్ధ్యాన్ని మెరుగుపరిచే క్రమంలో మీకేం అవసరమైన నిర్భయంగా చెప్పండని పారిశుద్ధ్య కార్మికులకు భరోసా ఇచ్చారు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా రామకృష్ణాపురం, అజిత్ సింగ్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉడా కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రామకృష్ణాపురంలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారికి పారిశుద్ధ్య నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమకు తెలుపవచ్చని అన్నారు. పనిముట్లు, తోపుడు బళ్ళు అన్నీ బావున్నాయా అని అడిగారు. రాజీవ్ నగర్, ఉడా కాలనీ రోడ్లో, సైడ్ డ్రైన్ లో వ్యర్థాలు నిండిపోవడం గమనించి, వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని, నగరంలో సైడ్ డ్రైన్లు, డివైడర్లు, రోడ్ల పైన పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రత్యేకంగా సైడ్ డ్రైన్ లలో వ్యర్థాలు తొలగించడం పైన దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అజిత్ సింగ్ నగర్ లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ను పరిశీలించి వ్యర్థ నిర్వహణ ఖచ్చితంగా జరగాలని, వ్యర్థాల నుండి సంపద సృష్టించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అజిత్ సింగ్ నగర్ లోని అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి, వారికి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియపరచవచ్చని అన్నారు. స్వయంగానే ఆహారాన్ని వడ్డించి అక్కడ వచ్చిన ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నోడల్ ఆఫీసర్లు ప్రతిరోజు అన్న క్యాంటీన్ సందర్శించి అక్కడ ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

## శివ శివా శివాలయం వీధిలో ట్రాఫిక్ సమస్యలకు దారి చూపవా

**ట్రాఫిక్ సమస్యలపై మొత్తుకున్నా ఓ కొలిక్కి రాని వైనం**







**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వన్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆక్రమణ నియంత్రణ పోలీసులకు తలనొప్పి గా మారింది శివ శివా శివాలయం వీధిలో ట్రాఫిక్ సమస్యలకు దారి చూపవా అంటూ ట్రాఫిక్ పోలీసులు తలలు పట్టుకొంటున్నారు. ఐనా పట్టువదలని విక్రమార్కునిలా వారి ప్రయత్నాలు వదలడంలేదు. ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఉత్తర్వుల ప్రకారం, ట్రాఫిక్ డిసిపి షేక్ షరీన్ బేగం ఆదేశాల మేరకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్ర రావు,వన్ ట్రాఫిక్ సెక్టర్ 1 ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు స్వయంగా పాల్గొని వన్ టౌన్ శివాలయం వీధిలో ట్రాఫిక్ కి, పాదచారులకి అంతరాయం కలిగిస్తున్న వివిధ రకాలైన దుకాణదారుల వివిధ రకాలైన వస్తువులు తొలగించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతిసారి డ్రైవ్ చేస్తున్నప్పటికీ మీలో ఎటువంటి మార్పు రావడంలేదని ఈసారి కఠిన చర్యలు తీసుకుంటామని, పాదచారులకు, ట్రాఫిక్ కి ఎటువంటి అంతరాయం కలిగించరాదని హెచ్చరించారు. రోడ్డుపై అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలను తొలగించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ఏ సి పి, సి ఐ లతో పాటుగా ట్రాఫిక్ ఎస్ఐ బి శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని...మానసికోల్లాన్ని అందించేది క్రీడలే








**విశాఖపట్టణం డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆరోగ్యాన్ని మానసికోల్లసాన్ని అందించేది క్రీడలే అన్న రీతిలో నేడు విద్యాసంస్థలు చదువులతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ క్రీడా పోటీల్లో సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు మనుమరాళ్ళు, మనుమడు బహుమతులు సాధించారు. విశాఖ గాజువాక ' ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ' లో గత రెండు రోజుల పాటు జరిగిన క్రీడా దినోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో వేదుల రాఘవ , లలితా జ్యోతి దంపతుల కుమార్తె కృత్తిక (7 వ తరగతి) ఖో ఖో లో ద్వితీయ స్థానం లో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ అలాగే కుమారుడు కార్తికేయ (3 వ తరగతి) రన్నింగ్ రేస్ లో ద్వితీయ స్థానం తో సర్టిఫికేట్, సిల్వర్ మెడల్ పొందారు. హైదరాబాద్ నిజాంపేట్ లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ లో జరిగిన క్రీడోత్సవాల్లో నిమ్మరాజు శ్రీవత్సవ కుమార్ - శ్రీమతి నాగజ్యోతి దంపతుల కుమార్తె జోష్నిక ప్లేస్కూల్ విభాగం రన్నింగ్ రేస్ నాలుగో స్థానం లో సర్టిఫికెట్ పొందింది.

## బహుళ నైపుణ్యాలతో విజయం సాధ్యం






**విజయవాడ పశ్చిమ డిసెంబరు 2: (వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి అనేక నైపుణ్యాలు తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ వ్యాపారవేత్త వాసిరెడ్డి మురళీకృష్ణ అన్నారు. కెబిఎన్ పీజీ కళాశాల మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'మీట్ ద సీఈఓ' కార్యక్రమంలో మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, వ్యాపార సంస్థ విజయానికి నాయకత్వం ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పారు. చదువుతో పాటు వ్యాపార నిర్వహణ గురించిన వాస్తవ పరిస్థితులను అధ్యయనం చెయ్యాలన్నారు. అధునాతన సాంకేతిక విధానాల పట్ల అవగాహన, వినియోగదారుల అభిరుచులను తెలుకునే నేర్పు ఉండాలన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న పరిస్థితులు, టైం మేనేజ్మెంట్ తదితర అంశాలను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. వ్యాపారరంగంలో తన అనుభావాన్ని వివరిస్తూ వ్యాపారం ప్రారంభించే దశ నుంచి విజయవంతంగా నడిపించే దశ వరకు ఉన్న వివిధ దశలు, నేపథ్యాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు వాస్తవ పరిస్థితుల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పి.జి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేశ్, మేనేజ్ మెంట్ విభాగాధిపతి రవికిరణ్, అధ్యాపకురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 3 అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షను జయప్రదం చేయండి....



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రేపు జరగనున్న ఆవేదన దీక్షకు అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం దాసరిభవన్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ , అజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇ.వి.నాయుడు పిలుపు నిచ్చారు. ఈ సందర్భముగా నాయుడు మాట్లాడుతూ గత 12 సంవత్సరాల కాలంగా అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్విరామ పోరాటాన్ని కొనసాగిస్తున్నదని. గత రెండు ప్రభుత్వాల కాలంలో తాము చేసిన ఉద్యమ ఫలితంగా చనిపోయిన 142 మంది బాధితులకు 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్గ్రేషియాను 10 నుండి 20 వేల లోపు డిపాజిట్స్ ఉన్న పేద, దిగువ మధ్యతరగతికి చెందిన డిపాజిట్ దారులకు చెందిన 906 కోట్ల రూపాయలను ఇప్పించగలిగాము. ఈ కూటమీ నాయకులు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో అటాచ్ చేయబడిన ఆస్తులను అమ్మి బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని చెప్పడం జరిగింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి నేటికి 18 నెలలు పూర్తవుతున్నా ఆదిశగా చర్యలు చేపట్టాక పోవడం అగ్రిగోల్డ్ బాధితులకు వెన్నుపోటు పొడవడమే అని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి మరొక సారి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదనను తెలియజేసేందుకు రేపు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో అగ్రిగోల్డ్ బాధితులతో పెద్ద ఎత్తున ప్రదర్శన - ఆవేదన దీక్ష కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిదని తెలియజేసారు . ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్ (గడియారం స్థంభం) నుంచి గాంధీనగర్ ధర్నా చౌక్ వరకు అగ్రిగోల్డ్ బాధితులు ప్రదర్శనగా చేరుకొని 11 గంటల నుంచి ధర్నా చౌక్ లో ఆవేదన దీక్షను చేపట్టడం జరుగుతుందని ఈ దీక్షను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రారంబిస్తారని. ఈ దీక్ష ద్వారా భాదితుల గోడు ప్రభుత్వం దృష్టికి మరొక సారి తీసుకోని వెళ్లనున్నట్లు తెలియజేసారు. అగ్రి గోల్స్ బాధితుల సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో భవిష్యత్ లో ఈ పోరాటాన్ని మరింత ఉదృతం చేయడం ద్వారా బాధితులకు న్యాయం జరిగే విధముగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళతామని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో విజయవాడ పట్టణ కార్యదర్శి ఎస్.కె .షరీఫ్ , యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కృష్ణా జిల్లాలో విద్యార్థుల సామర్థ్యాల అంచనా కైకలూరులో సర్వే వేగంగా కొనసాగుతోంది.



**కైకలూరు డిసెంబర్ 2 (వార్త ప్రభ)** ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అంచనా వేయడానికి చేపట్టిన సర్వే కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. దీనిలో భాగంగా కైకలూరు మండలంలోని హార్ట్ పార్క్ క్లస్టర్ పాఠశాలలను అంగుళూరు డైట్ కళాశాల అధ్యాపకురాలు ఎమ్. శివ పార్వతి పర్యవేక్షించారు.సర్వే వివరాలు వెల్లడించిన శివ పార్వతి మాట్లాడుతూ, కైకలూరు మండలంలోని వివిధ క్లస్టర్ పాఠశాలలకు మంగళూరు డైట్ కళాశాల విద్యార్థిని శశి శ్రీదేవిని నియమించామని తెలిపారు. విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం మౌలికంగా ప్రశ్నలు అడిగి, వారి సామర్థ్యాలను అంచనా వేసి సంబంధిత వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు.సర్వే అన్ని మండలాల్లో సమర్థవంతంగా, సక్రమంగా కొనసాగుతుండటం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సుగుణ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక రంగంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కొత్త అధ్యాయం

## రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కోటి దీపోత్సవానికి రికార్డు గుర్తింపు.

**మచిలీపట్నం డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆధ్యాత్మిక పరంపరకు పేరుగాంచిన మచిలీపట్నంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన కోటి దీపోత్సవం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. నవంబర్ 13న జరిగిన ఈ మహోత్సవంలో 35 అడుగుల పరమశివుడి విగ్రహం ఎదుట 3,900 మంది భక్తులు కలిసి కోటి దీపాలను వెలిగించి భక్తి ఘనతను చాటుకున్నారు. ఒక్కోసారి లక్ష వత్తుల చొప్పున దీపారాధన నిర్వహించడం ఈ వేడుక ప్రత్యేకత. రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు సమీపంలోని రంగనాయక స్వామి దేవాలయంలో కూడా భారీ సంఖ్యలో భక్తులు దీపారాధనలో పాల్గొన్నారు. భక్తులతో కళకళలాడిన ఈ సందర్భం ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనమై, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారికంగా ఈ ఘనకార్యక్రమాన్ని రికార్డుగా నమోదు చేసింది. ఈ రికార్డు గుర్తింపు పత్రాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ డా. చింతపట్ల వేంకటా చారి



స్వయంగా దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ శ్రీ డెసు నిరాజ గారికి, కార్యనిర్వాహణ అధికారి సమ్మెట ఆంజనేయ స్వామి గారికి మంగళవారం జరిగిన సభలో అందజేశారు. ట్రస్టు బోర్డు అధ్యక్షురాలు శ్రీమతి డెసు నీరజ అధ్యక్షతన వేడుక జరగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కొర్రపాటి గోపిచంద్ మాట్లాడుతూ, మచిలీపట్నం చారిత్రక దేవాలయాలకు నిలయం అని, నూతన కమిటీ కొద్ది రోజుల్లోనే వినూత్న రికార్డు సాధించడం అభినందనీయం అని పేర్కొన్నారు. డా. చింతపట్ల వేంకటా చారి గారు మాట్లాడుతూ, “35 అడుగుల పరమశివుడి విగ్రహం ఎదుట వేలాది మంది కలిసి కోటి దీపారాధన చేయడం అరుదైన ఆధ్యాత్మిక ఘట్టం. కూలంకుషంగా పరిశీలించి ఈ రికార్డును అందజేస్తున్నాము. భవిష్యత్తులో దేవస్థానం మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నాంది పలకాలనుకుంటున్నాము” అని తెలిపారు. ఈ వేడుకలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోట మర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్ చిత్త జల్లు నాగరాము సబ్, జైలు సూపరింటెండెంట్ పిల్లా రమేష్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ మామిడి మురళీ కృష్ణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ దిలీప్, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, గుడివాడ క్రైమ్ సీఐ ఇంజరపు రమణీ, ముదిగొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధికి సేవలందిస్తున్న డెసు సుబ్రహ్మణ్యం కృషిని వక్తలు అభినందించారు. అలాగే ఈ సందర్భంగా అర్చకుడు భాస్కర శర్మను డా. చింతపట్ల వేంకటా చారి ప్రత్యేకంగా సత్కరించారు.

# మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ కు సిద్ధం కావాలి....

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**మచిలీపట్నం డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనెల 5 వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులకు సూచించారు. మెగా పిటిఎమ్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నగరంలోని పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడి చేపట్టవలసిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. తొలుత నగరంలోని రాజుపేట నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు.. అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్.ఎల్.ఎన్ ( ఫౌండేషన్ లిటరసి న్యూమరసి) బేస్ లైన్ పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం దేశాయిపేట లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన విజ్ఞానాన్ని కలిగించే జాదూయి పిటారా వివిధ రకాల పరికరాలను, క్రికెట్, ఫుట్బాల్ వంటి క్రీడా సామాగ్రిని పరిశీలించారు. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు అందరికీ సమాచారం అందించారా లేదా మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు సజావుగా చేస్తున్నారా లేదా అని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను విచారించారు. విద్యార్థుల పురోగతిని తెలిపే హోలిస్టిక్ కార్డులు,బేస్ లైన్ పరీక్షల నివేదికలు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసి విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు, ఈ సమావేశానికి మంత్రివర్యులు కూడా వస్తారని అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఐ ఎఫ్ పి ప్యానెల్స్ ద్వారా విద్యను బోధిస్తున్న విధంగానే వివిధ రకాల పరికరాలను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిప్యూటీ ఈవో శేఖర్ సింగ్, ఎంఈఓ లు దుర్గాప్రసాద్, గురు ప్రసాద్, శోభారాణి,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిఆర్పి యూనస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎండిఓ ని సన్మానించిన బీసీ సంఘ నేతలు



**జగ్గయ్యపేట డిసెంబర్ 2 (వార్తప్రభ)** మండలం చిలకల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ ఎండిఓగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె ఇమామ్ నీ సన్మానించడం అయినది. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తూమాటి కృష్ణమాచారి , మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, వరదరాజుల దేవస్థాన డైరెక్టర్ ఉద్దంటి వాసు, తంగేళ్ల శ్రీనివాసరాజు ఎన్టీఆర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 మంజూరు పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

**జగ్గయ్యపేట డిసెంబర్ 2 (వార్తప్రభ)**నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఉద్దేశించిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇళ్ల నిర్మాణానికి మంజూరైన పత్రాలను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంగళవారం మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఒక ప్రాథమిక అవసరమని, పక్కా ఇళ్లు నిర్మించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, వారికి భద్రత, గౌరవప్రదమైన జీవితం లభిస్తాయని తెలిపారు. ఈ పథకం కింద సొంత స్థలం కలిగిన అర్హత గల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం మొత్తం రూ. 2.50 లక్షల (రెండున్నర లక్షల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని స్పష్టం చేశారు. ఈ రూ. 2.50 లక్షల మొత్తాన్ని ఇళ్ల నిర్మాణం పురోగతి ఆధారంగా పారదర్శకంగా, విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. లబ్ధిదారులకు మొదటగా, మంజూరు పత్రం అందుకున్న తర్వాత మరియు పునాది దశలో ఉన్నప్పుడు మొదటి విడత నిధులు విడుదల అవుతాయి. ఆ తర్వాత, నిర్మాణం రూఫ్ లెవల్ (కప్పు) వరకు పూర్తయిన అనంతరం రెండవ విడత, ఇంటి నిర్మాణం పూర్తిగా పూర్తయి, కిటికీలు/తలుపులు బిగించిన అనంతరం మూడవ విడత నిధులు లభిస్తాయి. చివరగా, ఇంటి



నిర్మాణం పూర్తి అయిన తర్వాత, అది పూర్తి నివాసయోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం నాల్గవ మరియు చివరి విడత నిధులు అందించి, మొత్తం రూ. 2.5 లక్షల సహాయం పూర్తవుతుందని ఆయన తెలిపారు. ఈ దశలవారీ చెల్లింపు విధానం వలన నిధులు సరైన విధంగా కేవలం నిర్మాణానికి మాత్రమే ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్మన్ శ్రీ రంగాపురం రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్, స్థానిక మున్సిపల్ అధికారులు, ముఖ్య నాయకులు, పీఎంఏవై లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు.... కృష్ణాజిల్లా పంచాయతీ అధికారి.



**మచిలీపట్నం డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథంకృష్ణాజిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా పంచాయతీ అధికారి అరుణా తెలిపారు . అక్టోబర్ 2తారీఖున నుంచి ప్రారంభించిన ఈ స్వచ్ఛ రథం ను 9 గ్రామపంచాయతీలలో ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ, వార్డులలో ఈ స్వచ్ఛ రథాలు వస్తాయని గ్రామ పంచాయతీలలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలన్నారు. ఈ స్వచ్ఛ రథాలను మొదటిగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, గనులు, భూగర్భ ,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం జండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ రథం వస్తుందని ఇంటిలో ఉన్న చెత్తను విక్రయించి, నిత్యవసర వస్తువులు తీసుకోవాలని డిపిఓ అరుణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**జగ్గయ్యపేట డిసెంబర్ 2 (వార్తప్రభ)**పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా నిలుస్తున్నారని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు జగ్గయ్యపేట నియోజకవర్గం లో 87 మందికి గాను 54,11,472 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, సంతోషంగా ఉండాలని ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. తాజాగా నియోజకవర్గంలో 108 మందికి 56 లక్షల 6 వేల రూపాయలు చెక్కులను అందించామన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయటం పట్ల ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ 2014 - 19 మధ్య కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తున్నమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీపం 2 పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతినెల ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోస పింఛన్లు రూ .4000 , రూ.6000. రూ.10,000 రూ. 15 వేల రూపాయల చొప్పున సంవత్సరానికి రూ 3 వేల కోట్ల రూపాయలు అందజేస్తున్నామన్నారు. చంద్రబాబు అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. పి- 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం అని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

# దర్గా బ్రిడ్జిని పరిశీలించిన జంపాల సీతారామయ్య



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 02(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి హజ్రత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా కు వెళ్లే కాలినడక ఇనప బ్రిడ్జి కింద డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ అధికారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారు. దీంతో బ్రిడ్జి పునాదుల వద్ద బీటలు ఏర్పడి బ్రిడ్జి భద్రత ప్రమాదంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య మంగళవారం నాడు బ్రిడ్జిలు పరిశీలించారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంఘటన స్థలం నుండే అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. బ్రిడ్జి భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే స్పందించిన వీటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ రామాంజనేయులు బుధవారం సివిల్ ఇంజనీర్ లతో కలిసి బ్రిడ్జిలు పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ కో- ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫైజాన్, దర్గా ముజావర్లు పాల్గొన్నారు.

# సొంగా అబ్రహం జ్ఞాపకార్థం ప్రేమవిందు



**రెడ్డిగూడెం డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో నిరుపేదలైన వారికి మంగళవారం నాడు అన్నసంతర్పణ (ప్రేమవిందు) జరిగింది. రామాపురానికి చెందిన కీర్తిశేషులు పాస్టర్ సొంగా అబ్రహం జ్ఞాపకార్థం వారి కుమార్తెలు బంకా సత్యశ్రీ, ప్రత్తిపాటి సుష్మా షారోను ద్వారా జరిగిన ఈ ప్రేమవిందు కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చాట్ల విజయకుమార్, డైరెక్టర్ హన్న, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తుగా నల్లగోపుల చలపతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కామినేని పుట్టినరోజు వేడుకలు.





**కలిదిండి డిసెంబర్ 2 (వార్తా ప్రభ)** కలిదిండిలోని ప్రధాన కూడలిలో కైకలూరు శాసనసభ్యుడు డా. కామినేని శ్రీనివాస్ ముందస్తు పుట్టినరోజు వేడుకలను కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ నల్లగోపుల వెంకట చలపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.రేపు డిసెంబర్ 3 తేదీన జరగనున్న జన్మదిన శుభాకాంక్షల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామినేని శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చలపతి 1500 మందికి అన్నదానం నిర్వహించారు.కార్యక్రమానికి ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కామినేని శ్రీనివాస్‌కు ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# కొండపల్లి మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

## కో - ఆప్షన్ సభ్యులకు నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వసంత









**ఇబ్రహీంపట్నం,డిసెంబర్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక మంగళవారం నిర్వహించారు. చైర్మన్ చిట్టిబాబు, ఇన్చార్జి కమిషనర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.కో - ఆప్షన్ సభ్యులుగా షేక్ మహబూబ్ సుభాని (టీడీపీ), యర్రంశెట్టి నాని (జనసేన), షేక్ నగీనా (బీజేపీ) లను సభ్యులు ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కో - ఆప్షన్ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమిలో భాగంగా ఈ ముగ్గురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ రాష్ట్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందని అన్నారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని కో ఆప్షన్ సభ్యులకు సూచించారు.మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ మైలవరం నియోజకవర్గ ఇంఛార్జి నూతులపాటి బాలకోటేశ్వరరావు (బాల), జంపాల సీతారామయ్య, మాధురి, చెరుకుమల్లి సురేష్, ఎన్డీఏ కూటమి నేతలు,తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం (తాతయ్య)

**జగ్గయ్యపేట డిసెంబర్ 2 (వార్తప్రభ)** పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొన్నారు. మంగళవారం ప్రత్యేక అన్నదానాన్ని నిర్వహించిన లాయర్ రాయపూడి శ్రీనివాసరావు చేత ఏర్పాటు చేసిన సేవలో ఎమ్మెల్యే స్వయంగా వడ్డన చేసి సేవ చేశారు.ప్రతిరోజూ అయ్యప్ప స్వాముల కోసం శ్రీ వన్ పులి వాహన సేవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించబడుతుందని ఆయన చెప్పారు. రోజూ సుమారు 400 నుండి 500 మంది అయ్యప్ప స్వాములు, శివయ్య స్వాములు, భవానీ స్వాములు ఈ అన్నదానంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సేవా కార్యక్రమం దేవాలయ కమిటీ పర్యవేక్షణలో నిరంతరాయంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే గారు అభినందన వ్యక్తం చేశారు.



# డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పీజీఆర్ఎస్ లో వినతి

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 02(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం పరిధిలోని డాక్టర్ జాక్సన్ కాలేజీ రోడ్డులో డ్రైనేజ్ నీరు తాగునీటి పైపులైన్‌లో కలిసిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ళ పండులి పీజీఆర్ఎస్ ద్వారా డి.ఆర్.ఓ లక్ష్మీ నరసింహారావు కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు పచ్చిగోళ్ళ పండు



మాట్లాడుతూ ప్రజలు రోజూ వాడే తాగునీటిలో డ్రైనేజ్ నీరు కలవడం చాలా తీవ్రమైన సమస్య. పైపులైన్ మరమ్మతులు, పారిశుద్ధి పనులు, డ్రైనేజ్ సిస్టమ్ పునరుద్ధరణను అత్యవసరంగా చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి” అని ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు ఇంచార్జ్ లవ్ కుమార్ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి బొత్స సత్యనారాయణ.

**డిఎన్ఆర్ ఆధ్వర్యంలో వైసీపీ సమన్వయ కమిటీ సమావేశం.పాల్గొన్న వైసీపీ రాష్ట్ర కీలక నేతలు.**





**మండవల్లి డిసెంబర్ 2 (వార్తా ప్రభ)** మండవల్లి మండలం పెరికేగూడెంలో ఉన్న డాల్ఫిన్ పాలిమర్స్‌లో ఏలూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశాన్ని ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి ప్రతిపక్ష నేత, ఉభయగోదావరి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ కార్యకలాపాలు, గ్రామస్థాయి బూత్ కమిటీల దృఢీకరణపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది.ఏలూరు పార్లమెంట్ పరిశీలకుడు వంకా రవీంద్రనాథ్, పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జగ్గంపూడి రాజా సహా పలు కీలక నేతలు ఈ సభలో పాల్గొన్నారు. నూజివీడు, పోలవరం, ఏలూరు, చింతలపూడి నియోజకవర్గాల ఇంచార్జ్‌లతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథం కూడా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర బీసీ సెల్, మహిళా విభాగం, రైతు విభాగం, ముదిరాజ్ సంఘం, క్రిస్టియన్ మైనారిటీ విభాగం వంటి అనేక విభాగాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం ఈ సమావేశానికి విశేష ఆకర్షణగా నిలిచింది. మండవల్లి, ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి ప్రాంతాల పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, ప్రచార విభాగ ప్రతినిధులు, వాలంటీర్ల విభాగ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరవుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సమావేశంలో నాయకులు పార్టీ బలోపేతం, ప్రజల సమస్యల పరిష్కారం, రాబోయే కార్యక్రమాల రూపురేఖలపై చర్చించారు. గ్రామం నుంచి జిల్లా దాకా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే విధంగా ఈ సమావేశం సాగింది.

# ప్రజల క్షేమమే ధ్యేయంగా, నగరాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉండాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల క్షేమమే ధ్యేయంగా, నగరాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో శాఖాధిపతులతో 2026-2027 బడ్జెట్ అంచనాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రెవెన్యూ , క్యాపిటల్, ఆదాయం, ఖర్చు పై సమీక్షించారు. నగరాభివృద్ధికి, శాఖల వారిగా వారికి అయ్యే ఖర్చు, పరిశీలించారు. ప్రజల క్షేమం, నగరాభివృద్ధి కోసం చేసే అభివృద్ధి కార్యక్రమాలు, నగర స్వచ్ఛత, ప్రజారోగ్యంకు ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో శాఖాధిపతులు తెచ్చిన బడ్జెట్ అంచనాలను శాఖాధిపతులు తమ సిబ్బందితో మరొకసారి సమీక్షించి, బడ్జెట్ అంచనాలపై వచ్చేవారం నిర్వహించే సమీక్ష సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డీఎఫ్ఓ మల్యాద్రి, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) ఇన్చార్జ్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, అకౌంట్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు డ్రైనేజీలు అభివృద్ధి చేయండి : యార్లగడ్డ



**గన్నవరం : డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గన్నవరం నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చీఫ్ ఇంజనీర్ ను కోరారు. మంగళవారం సాయంత్రం పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కోటంక విజయ కుమారి గన్నవరం లోని కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకట్రావును కలిసి నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో గుంటలు పడిన రహదారులను తక్షణమే మరమ్మతులు చేయటం లేదా పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాల్లో డ్రైనేజీ పనులు చేపట్టి మురుగునీరు సక్రమంగా పారుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధులు కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సంబంధిత మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు అయ్యేందుకు కృషి చేస్తానని యార్లగడ్డ చెప్పారు.

# సాగునీటి సంఘాల వ్యవస్థతో రైతులకు నిర్ణయాత్మక భాగస్వామ్యం

**సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు "ఆళ్ళ"**

**విజయవాడలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు బాధ్యతలపై అవగాహన సదస్సు**



**విజయవాడ :డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సాగునీటి వ్యవసాయానికి కేవలం సాంకేతిక నైపుణ్యం మాత్రమే చాలదని, సామాజిక పరిజ్ఞానం కూడా అవసరమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థతో రైతులకు నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని కల్పించిందని సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అన్నారు.ఈరోజు సాయంత్రం విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలో రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణా జిల్లా నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని సాగునీటి వినియోగ దారుల సంఘాలకు బాధ్యతలను పెంపొందించడం పై జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ యం. ఆర్. మొహిద్దిన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ సాగునీటి సంఘాల అధ్యక్షులు పంట క్యాలెండర్లు, వారబంధీ అమలులో సహకరించడం, వివాదాల పరిష్కారం, నేల మరియు నీటి నాణ్యతను అంచనా వేయడం, "నీటి డిమాండ్ – సరఫరా" మధ్య ఉన్న అంతరాన్ని ప్రత్యామ్నాయ చర్యల ద్వారా తగ్గించడం, ఉపరితల జలాలు,భూగర్భ జలాల సమన్వయ వినియోగం ద్వారా సమాన మరియు సమర్థవంతమైన పంపిణీ చేయడానికి కృషి చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ నాగార్జునసాగర్ కాలువ రెండు, మూడు జోన్ లలో 3.67 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని దీన్ని ఆనుకుని చెరువులు, బోర్లు క్రింద 1.77 లక్షల ఎకరాల ఆయకట్టును పెంచడానికి సాగు నీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని, నీటి సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించిన పనులను డిసెంబర్ నెలాకరు లోపు పూర్తి చేయాలని సాగునీటి సంఘాల ప్రతినిధులకు సూచించారు. భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వాగులపై చెక్ డ్యాంలు ,చెరువుల పూడిక తీత,కాలువల పూడిక తీత తదితర నీటి సంరక్షణ పనులను సాగునీటి సంఘాల ప్రతినిధులు చేపట్టి భూగర్భ జలాల పరిరక్షణ పెంపొందించాలని సూచించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్ యం. ఆర్. మోహిద్దీన్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని నీటి నిర్వహణను మెరుగుపరచడానికి 9 సబ్ డివిజన్ పరిధిలో 90 మంది ఔట్సోర్సింగ్ కింద లస్కర్లను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఎన్.ఎస్.పి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కే. రామదాసు, కే.కిషోర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరియు జలవనుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈశ్వరీబాయి జయంతి




**కంచకచర్ల, డిశంబర్ 2( వార్త ప్రభ)** కృష్ణా జిల్లా కంచికచర్లలో దళిత పాలేరు కోటేసును కొంతమంది పెత్తందార్లు సజీవదహనం చేసిన సమయంలో ఆమె అసెంబ్లీలో స్పందించిన తీరు అనిర్వచనీయం. ఈ సంఘటనపై అసెంబ్లీలో ఆమె పట్టుబట్టి మరీ చర్చకు తీసుకొచ్చిన సందర్భంలో ఆనాటి వ్యవసాయ శాఖ మంత్రి తిమ్మారెడ్డి చర్చ మధ్యలో కలుగజేసుకుని 'దొంగతనం చేస్తే కాల్చి చంపకుండా ముద్దు పెట్టుకుంటారా?' అని అనగానే 'ఎవడురా ఆ కూత కూసినవాడు, దళితులు మీకు దొంగల్లా కనిపిస్తున్నార్రా! సాటి మనిషిని సజీవ దహనం చేస్తారా? దళితులను దొంగలు అంటే చెప్పుతో కొడతా' అని ఆయన మీదకి చెప్పు విసిరి తగిన సమాధానం చెప్పిన తీరు చరిత్రాత్మకమైనది. ఒక నిజమైన అంబేద్కర్ వారసుడు, వారసురాలు చట్టసభల్లో అడుగు పెడితే ఎలా ఉంటుందో ఈ ఒక్క ఘటనతో అర్థం చేసుకోవచ్చు. నేడు దేశం, రాష్ట్రం నలుమూలల ప్రతి క్షణం దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా, అంబేద్కర్ కల్పించిన అవకాశాల ద్వారా ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏ ఒక్క రోజు కూడా చర్చించే సాహసం చేయడం లేదు. కానీ ఆమె ఒక్కరే అసెంబ్లీ మొత్తాన్ని గడగడలాడించిన తీరు నేటి దళిత ప్రజాప్రతినిధులకు మార్గదర్శకం కావాలి. ఎమ్మెల్యేగా ఈశ్వరీబాయి అనునిత్యం అణగారిన ప్రజల అభివృద్ధి కోసం ఆరాటపడ్డారు. ప్రాంతీయ బేధం లేకుండా తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఏ మూలన అన్యాయం జరిగినా అక్కడ బాధితుల పక్షాన ఆమె నిలువెత్తు ధైర్యమై నిలబడ్డారు. మత్స్యకారుల హక్కులను కాలరాస్తూ కామారెడ్డి పెద్ద చెరువును వారికి దూరం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను వెనక్కి తీసుకునే వరకు పోరాడి మత్స్యకారులకు చెరువు ఇప్పించారు. ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై, వ్యవసాయ రైతుల సమస్యలపై, బంజరు భూముల పంపిణీపై, చేనేత కార్మికుల సమస్యలపై, విద్య-వైద్యం-ఆరోగ్యం, నిరుద్యోగ సమస్య, ఉపాధి కల్పన, జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీల సమస్యలపై, టీచర్స్, ఉద్యోగుల సమస్యలపై, వృద్ధాప్య పింఛన్ల పెంపు కోసం చర్చించడానికి అసెంబ్లీని ఆమె చక్కగా ఉపయోగించుకున్నారు.నిర్విరామంగా, అలుపెరగకుండా అనేక సమస్యలపై పోరాటం చేసి నేటి యువతలో, సామాజిక ఉద్యమకారుల్లో, రాజకీయ నాయకుల్లో, ప్రజా ప్రతినిధుల్లో, ఉద్యోగుల్లో నిరంతరం స్ఫూర్తిని నింపే నిప్పుకణం ఈశ్వరీబాయి. డాక్టర్ అంబేద్కర్ సంకల్పించిన స్వేచ్ఛ-సమానత్వం-సౌభ్రాతృత్వం పరిఢవిల్లే సమసమాజ స్థాపనే ఆమెకు నిజమైన నివాళి..

# దళిత విద్యార్థుల పై జాతి వివక్ష

***అవమానాలు ఇది సమాజానికి ఒక పెద్ద అవమానం.***

***ఎస్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్.....***



**పెనుగంచిప్రోలు, డిశంబర్ 2( వార్త ప్రభ)** పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని యూ-కొత్తపల్లి మండలం - యండపల్లి హైస్కూల్లో చదువుతున్న దళిత విద్యార్థులపై జరుగుతున్న జాతి వివక్ష, అవమానాలు, మానసిక వేధింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయనీ వై ఎస్ ఆర్ సిపి ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్ పేర్కొన్నారు.పెనుగంచిప్రోలు మండలం లోని ఆయన సొంత గ్రామం అయిన తోటచర్ల లో మంగళవారం విలేకరుల తో మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశంలో, సమానత్వ హక్కు అమలులో నడుస్తున్న ప్రజాస్వామ్యంలో, ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయంటే ఇది సమాజానికే ఒక పెద్ద అవమానం అని వైస్సార్సీపీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్ అన్నారు.ఈ సంఘటనపై బాధిత విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఆవేదనతో మాట్లాడుతూ, "మా పిల్లలను ఉపాధ్యాయులు కులం పేరుతో అవమానిస్తున్నారు,మీది వెధవ జాతి,ఎస్సీలు ఏమైనా పుడింగులా? అని కులం పేరుతో తిట్టుతున్నారని బాధతో నాకు తెలిపారు.అంతేకాదు, పాఠశాల హెడ్‌మాస్టరు కూడా ఆడ పిల్లలను అవమానకరమైన పదాలతో పిలుస్తున్నారని విద్యార్థులు ఆరోపించారన్నారు.పాఠశాలలో చదువుకోవడానికి వచ్చిన పిల్లలు, మానసికంగా నలిగిపోతూ, ఏడుస్తూ ఇంటికి వస్తున్నారన్న తల్లిదండ్రుల మాటలు హృదయ విదార కారణమన్నారు.ఈ రోజు బాధిత విద్యార్థులు మరియు తల్లిదండ్రులు కలిసి పాఠశాల ముందు బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు.తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేసే ఉపాధ్యాయులు ఈ వ్యవస్థలో ఉండటానికి అర్హులు కాదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన మరింత ఆందోళనకరం ఎందుకు అంటే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో జరగడం మరింత దురదృష్టకరమన్నారు.ఈ ప్రాంతంలోనే ఇలాంటి కుల వివక్ష కొనసాగితే "ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ అధికారులు ఏమి చేస్తున్నారు?" అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. కాబట్టి... 1. ఈ సంఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణ కమిటీ నియమించాలి. 2. దళిత విద్యార్థులను అవమానించిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 3. ఎస్సి ఎస్టి అట్రోసిటీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలి. 4. స్పెషల్ కౌన్సిలింగ్ మరియు విద్యార్థులకు మనో ధైర్యం కల్పించి చదువు కొవడానికి సహాయం అందించాలి. 5. అన్ని పాఠశాలల్లో ఆంటీ డ్యాస్క్రిమినేషన్ మానిటరింగ్ సిస్టం అమలు చేయాలి.ఎస్సీ కమిషన్ తక్షణం సుమోటోగా ఈ కేసును తీసుకోవాలి.ఈ ఘటన కేవలం పాఠశాల సమస్య కాదు.ఇది రాష్ట్రంలో ఇంకా బ్రతికి వున్న కులవ్యవస్థ, అసమానత్వం, అవమానించే మనస్తత్వం యొక్క నిదర్శనం. ప్రతి రోజూ రాష్ట్రంలో దళితులపై దాడులు, అవమానాలు, హింసలుసాధారణమైపోవడం చాలా బాధాకరం.స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా, విద్యాలయాల్లోనే కులమతాల పేరుతో చిన్నారులను అవమానించటం భారత రాజ్యాంగానికి అవమానం.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలకు ద్రోహమన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారందరిపై కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు..

# ఇంటర్ మొదటి సంవత్సరంలో స్టేట్ మొదటి ర్యాంక్ పొందిన సుహాసిని చౌదరి

**తల్లి తండ్రులను సత్కరించిన మొగలరాజపురం నారాయణ కాలేజ్ అమరావతి కాంపెస్**






**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇష్టంతో కష్టపడి చదవడం కొందరికే సాధ్యం అలా చదివిన వారు తమతో పాటుగా తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచుతారు. అలా గౌరవం పెంచిన ఇంటర్ విద్యార్థిని కి తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం సత్కరించటం జరిగింది. సుహాసిని చౌదరి ని యాజమాన్యం మంగళవారం ఉదయం మొగలరాజపురం పి బి సిద్దార్థ కాలేజీ లో విద్యార్థిని సత్కరించారు. కాలేజ్ యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అతిధులుగా త్రి టౌన్ ట్రాఫిక్ సీఐ కిషోర్ బాబు,ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ సీఐ రామారావు లు పాల్గొన్నారు.మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థి సుహాసిని చౌదరి ఈ సందర్భంగా మాట్లాడుతూ..... నా తల్లితండ్రుల టీచర్స్ సపోర్ట్ తో నాకు ర్యాంక్ రావడం 470 కి 468 మార్కులు రావడం సంతోషంగా ఉందిని నా విజయం కి కారణం ఐన నారాయణ కాలేజ్ కి నా కృతజ్ఞతలు ఆబ్జెక్టివ్, ఐపీ రెండు కష్టంగా ఉన్నా ప్లానింగ్, తో విజయం సాధించానని ఆ విద్యార్థిని తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన గడ్డం రాంబాబు యాదవ్

**జగ్గయ్యపేట డిసెంబర్ 2 (వార్తప్రభ)**పట్టణ మున్సిపల్ పరిధిలోని ఎడో వార్డు లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన గడ్డం రాంబాబు యాదవ్. ఆర్టీసీ కాలనీ సర్వేనెంబర్ 153 లో విశాలమైన 33 అడుగులు 40అడుగుల గ్రావెల్ రోడ్లు ఉన్నాయని. వర్షాకాలంలో వర్షాలు కురిసిన ప్రతిసారి వేపల వాగు కి వరద రావడంతో రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయని. మరియు డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండడంతో వ్యాధులు ప్రభలమయ్యే అవకాశం ఉన్నదని. అంతేకాకుండా ఆ ప్రాంత వాసులకు మంచినీటి పైప్ లైన్ కూడా అవసరం ఉన్నదని. ఈ సర్వే నంబర్లో నూతనంగా సుమారు 40 కి పైగా భవనాలు నిర్మించడం వల్ల వాటి ప్లాన్ ల నిమిత్తం సుమారుగా కోటి రూపాయల ఆదాయం మున్సిపాలిటీకి చేరిందని. కావున సర్వే నెంబర్ 153 లో మౌలిక సదుపాయాలైన సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసుల తరపున కమిషనర్ ను కోరడమైనదని గడ్డం రాంబాబు యాదవ్ తెలిపారు.

# నేడు శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం లోని హుండీల లెక్కింపు



**పెనుగంచిప్రోలు, డిశంబర్ 2( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం లో భక్తులు వేసిన కానుకల హుండీలను బుధవారం ఉదయం ఆలయ కార్యనిర్వాహణాదికారి మరియు డిప్యూటీ కమిషనర్ కిశోర్ కుమార్, చెర్మన్ జంగాల శ్రీనివాసరరావు మరియు విజయవాడ దేవదాయ ధర్మ దాయ అధికారులు ఆధ్వర్యంలో లెక్కించ నున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తులు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం లో పాల్గొని అమ్మ వారి కృపకు పాత్రులు కాగలరు...

# జి.కొండూరులో కోటి సంతకాల సేకరణ

***కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ***





**జి.కొండూరు డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు,మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాలమేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "కోటిసంతకాల సేకరణ" కార్యక్రమాన్ని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ సర్పంచ్ మండల అరుణ, పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభిం చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు వేములకొండ విష్ణు, ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం కార్యదర్శి పజ్జురు తిరుపతి రావు,నీలపాల ముత్తయ్య, షేక్.బాజీ,గోవర్ధన్,రామిరెడ్డి, పజ్జూరు శ్రీకాంత్, దొప్పల రాంబాబు, ఉంద్రకొండ నాగరాజు, పజ్జూరు కృష్ణరావు,సైదులు, వేములకొండ టినా కాంత్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పొడి చెత్తకు కిరాణా వస్తువులకు విశేష ప్రజా స్పందన...



**గుడ్లవల్లేరు:డిసెంబర్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పొడి చెత్త సేకరణ చేసి తమకు అందించే ప్రజలకు కిరాణా వస్తువులను అందించే కార్యక్రమానికి విశేష ప్రజా స్పందన లభిస్తోందని గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు అన్నారు. ఈ పథకానికి సంబంధించిన స్వచ్ఛ రథం మంగళవారం మండలంలోని గుడ్లవల్లేరులోని జేమ్స్‌పేట ఒకటో వార్డులో పర్యటించింది. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్లలోని ప్లాస్టిక్, ఓల్డ్ బుక్స్, స్టీల్, కార్డ్ బోర్డు, అల్యూమినియం, ఐరన్, పేపర్ వంటి తమ పొడి చెత్త(డ్రై వేస్ట్) స్వచ్ఛ రథానికి అందజేశారు. ఆ పొడి చెత్తకు బదులుగా పప్పు, ఉప్పు, కారం, సబ్బు వంటి కిరాణా వస్తువులు పొందారు. తమకు సహకరించి ఊరిని శుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు కషి చేస్తున్న గ్రామస్తులను కార్యదర్శి నరసింహారావు అభినందించారు.

# గుడివాడలో జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలు - ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● పోటీల నిర్వహణపై.. అధికారులు.. నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్షించిన ఎమ్మెల్యే రాము



**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అండర్ – 14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెల్లడించారు. 2026 జనవరి 19వ తేదీ నుండి 23 వరకు పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జనవరి 19వ తేదీ నుండి ఐదు రోజులపాటు జరిగే పోటీల నిర్వహణపై.. పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే రాము మంగళవారం సమావేశం అయ్యారు. సమావేశంలో పాల్గొన్న గుడివాడ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్.. పోటీల నిర్వాహకులతో ఎమ్మెల్యే రాము పలు అంశాలపై మాట్లాడారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా గుడివాడలో జరుగుతున్న పోటీలకు వచ్చే క్రీడాకారులు, కోచ్ లు, ఫెడరేషన్ పెద్దలకు ఇచ్చే ఆతిథ్యం, రవాణా, వసతి ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు నిర్వహించే అవకాశం గుడివాడకు రావడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 45 జట్లు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తకుండా పోటీల నిర్వహణపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ స్టేడియం సహకారంతో నిర్వహించే పోటీల విజయవంతానికి క్రీడాభిమానులు, దాతలు తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. నిర్ణీత సమయంలోపు వచ్చే తుది జట్ల జాబితా అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్, జాతీయ స్థాయి పోటీల నిర్వహణ కార్యదర్శి ఎస్.గంగాధర్, కమిటీ సభ్యులు ఎన్.రవిబాబు, బి.అనిల్, యం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌సి ఆఫ్ గుడివాడ ప్రగతి సేవలు అభినందనీయం - ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● ఎల్‌సి ఆఫ్ గుడివాడ ప్రగతి వారీ అధ్వర్యంలో విద్యార్థులకు సేవా కార్యక్రమాలు..

**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి సేవలు అభినందనీయమని లైన్స్ క్లబ్ ప్రగతి సభ్యులు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో రామనోళ్ళ మురళీధర్ రావు 10000/- సహకారంతో రెండు నెలలకు సరిపడా సరుకులు శ్రీ ప్రణవ ఆశ్రమం విద్యార్థులకు ఇవ్వడం జరిగింది అదేవిధంగా రామదేని వేణుబాబు మరియు ఉపద్రష్ట రాంబాబు మాదల సురేష్ సహకారంతో మూడు సైకిళ్ళు ఇవ్వడం జరిగింది తదుపరి లైన్స్ క్లబ్ ప్రగతి సభ్యులు మరియు ప్రణవశ్రమం స్వామీజీ వారి సమక్షంలో కేక్ కట్ చేసి ప్రగతి సభ్యులందరికీ వెనిగండ్ల రాము తన జన్మదినోత్సవం రోజు ప్రగతి సభ్యులు ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పామర్తి కేశవరావు, ఉపద్రష్ట రాంబాబు, మల్లంపల్లి వెంకటరావు, మహంకాళి వీర శేఖర్, రామనోళ్ళ మురళీధర్ రావు, రామదేను వేణుబాబు, బూరగడ్డ శ్రీకాంత్, విజయ భాస్కర్, సనక సుబ్బారావు, రమణ, చిలుకూరి యుగంధర్, నల్లూరి శేషగిరి రావు,



పోలవరపు శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి, అట్లూరి రాజా, కట్టా రవీంద్ర, యు రామారావు, అట్లూరి శశి, నాంచారయ్య, ఆశ్రమ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ బాధితుల్లో మనోధైర్యం నింపాలి





**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :**ఎయిడ్స్ బాధితులలో మనో ధైర్యం నింపి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి వ్యక్తి పై ఉందని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆశ పర్వీన్ సయ్యద్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని అక్కినేని నాగేశ్వర రావు కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులు తరచూ రక్త హీనతకు గురవుతారని అన్నారు. ఎయిడ్స్ తో బాధ పడే వారికి ఏడాదికోసారి సిడి 4 పరీక్ష చేయించాలని దాని కౌంట్ 250 లోపు వుంటే వారికి చికిత్స ప్రారంభిస్తారని అన్నారు. నేడు ఎయిడ్స్ వ్యాధికి మంచి మందులు వచ్చాయని దీనివల్ల వాళ్ళ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. ఎయిడ్స్ బాధితులను అంటరాని వారిగా చూడరాదని మరియు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలసి జీవించాలి, సుఖవ్యాధులు మరియు చికిత్స గురించి ఎయిడ్స్ యొక్క 2017, ఎ.ఆర్.టి. మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, సెక్రటరీ & కరస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు, ప్రిన్సిపాల్ డా. పి.జె.యస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి బి ఎస్ ఎస్ పద్మజ, రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు, ఎన్.ఎస్.ఎస్. మెంబర్స్ ఎ.జేసుబాబు, శ్రీమతి ఎ.గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ.. :** ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వాలంటీర్లు ఎయిడ్స్ నివారణ, మందుల వాడకం, ఎయిడ్స్‌పై భయపడకండి, జాగ్రత్తలు పాటించండి, భయం వద్దు – అవగాహన ముద్దు అని నినాదాలు చేస్తు స్థానిక వీధులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలుగచేసినారు. ఈ ర్యాలీ లో ఎన్ఎస్ఎస్ పి.ఓ. టి.జె. సతీష్ చంద్ర, కోఆర్డినేటర్ జి.జీవన్, స్టాఫ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రామన్న స్ఫూర్తిగా సేవలందిస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ..

● వెనిగండ్ల రాము పుట్టినరోజును పురస్కరించుకుని 30వ వార్డులో సేవా కార్యక్రమాలు..



**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** 30వ వార్డు ధనియాలపేట లో గుడివాడ నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుట్టినరోజు వేడుకలు కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు ఆధ్వర్యంలో ఆదర్శంగా జరిగాయి. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మనం ఖర్చుపెట్టే రూపాయి సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడే విధంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది అని రాము మాతో ఎప్పుడూ అంటూ ఉంటారని మజ్జాడ నాగరాజు తెలియజేశారు. రాము ఆలోచనలకు అనుగుణంగా మా ధనియాలపేట రజకుల చెరువు గట్టు వద్ద గత 15 సంవత్సరాలుగా ముళ్లకంచె చెట్లు ఉండటంవల్ల స్థానిక ప్రజలు, పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే రాము పుట్టినరోజు సందర్భంగా అంగులకు ఆదరాబాదు వృధా ఖర్చు చేయకుండా రాము యొక్క స్ఫూర్తితో మజ్జాడ నాగరాజు జెసిబి ని ఏర్పాటు చేసి ముళ్లకంచె చెట్లను తొలగించడం జరిగినది. దీంతో స్థానికులు నాగరాజుని ప్రత్యేకంగా అభినందిస్తూ.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

# గుడివాడ ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ చే 'స్పెషల్ క్యాంప్'

**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** గుడివాడ వీ.కే.ఆర్ అండ్ వీ.ఎన్.బి ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ సమన్వయ కర్త, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి. ప్రసాదరావు స్పెషల్ క్యాంప్ పేరిట ఏడు రోజులపాటు జరిగే ఎన్.ఎస్.ఎస్ సాంఘిక సేవా కార్య క్రమాలను నందివాడ లోని వేములపల్లి నాగయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి రోజు ప్రధానోపాధ్యాయులు పి.రవి కుమార్ పర్యవేక్షణలో "స్వచ్ఛ భారత్" ను ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు చేపట్టారు. తదుపరి విద్యార్థులకు శుభ్రత–పరిశుభ్రత పై ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య మరియు డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్ లు మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. వారోత్సవాలలో భాగంగా హై స్కూల్ లోని బాల బాలికలకు ఉచిత డెంటల్ క్యాంప్, కెరీర్ గైడెన్స్, హెల్త్ ఎవేర్నెస్, సే నో టు ప్లాస్టిక్, ఆటల పోటీలను నిర్వహిస్తామన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో బీ.టెక్ మొదటి సంవత్సరం విభాగాధిపతి చాపరాల శ్రీవాణి పర్యవేక్షణలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు 50 మొక్కలను నాటుతారు.




వారం రోజుల పాటు జరిగే 'స్పెషల్ క్యాంప్' ను జవాహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం సూచనలను అనుసరించి నిర్వహిస్తామని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.దిలీప్ తెలిపారు. ఎన్.ఎస్.ఎస్. స్పెషల్ క్యాంప్ తమ పాఠశాలలో ప్రారంభమవడం పట్ల నందివాడ మండల విద్యాధికారులు కె.శ్రీనివాసరావు, జి.డేవిడ్ రాజు, హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు హర్షం వ్యక్తపరిచారు.

# కాకినాడ నగరంలో సేవల మెరుగుదలకు కఠిన ఆదేశాలు

## – ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజా సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది కఠినంగా పనిచేయాలంటూ ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ స్పష్టం చేశారు. కాకినాడ స్మార్టు సిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన వివిధ అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.నగరంలో ఉన్న అనధికారిక నీటి కనెక్షన్లను ఈ నెల 10వ తేదీ లోపు తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేసుకోవాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. గడువు తీరిన తర్వాత కూడా రెగ్యులరైజేషన్ చేయని కనెక్షన్లకు నీటి సరఫరా నిలిపివేయాలన్నారు. ఈ చర్యల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.అలాగే ప్రాపర్టీ ట్యాక్సు, వాటర్ ట్యాక్సు కలెక్షన్‌ను వేగవంతం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టా లని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పన్నులు వసూలు చేయాలని, అదేవిధంగా పట్టణంలో ఉన్న ఖాళీ భూ ములను గుర్తించి సంబంధిత పన్నులు తప్పనిసరిగా వసూలు చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రజల నుండి వచ్చే పిజి ఆర్ఎస్ ఫిర్యాదులను సీరియస్‌గా పరిగణించి, సమస్యల పరిష్కారాన్ని స్వయంగా ప్రత్యక్షంగా తనిఖీ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి వార్డులో సచివాలయ సిబ్బంది స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమాలను చురుకుగా అమలు చేయాలని ఇంచార్జి కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ పిలుపునిచ్చారు.నగర పరిశుభ్రతలో ఎవరు నిర్లక్ష్యం చూపిన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పురమిత్ర యాప్ మరియు సేవలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును సమయానుకూలంగా పరిష్కరించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. సేవల నాణ్యత పెంపు, పన్నుల వసూళ్ల బలోపేతం, ప్రజా సౌకర్యాల మెరుగుదలే తమ లక్ష్యమని ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు విభాగాధిపతులు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా, కెనడా పర్యటనకు వెళుతున్న మంత్రి నారా లోకేశ్

**అమరావతి,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ 11, 12 తేదీల్లో ఆయన అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఇద్దరు ఉన్నతాధికారులు కార్తికేయ మిశ్రా, అభిషిక్త్ కిశోర్ కూడా పాల్గొననున్నారు. వీరిద్దరి పర్యటనకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మంత్రిగా నారా లోకేశ్ చేపట్టిన విదేశీ పర్యటనలు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో విజయవంతం అయ్యాయి. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జరిపిన పర్యటనల ద్వారా మంచి స్పందన లభించింది. ఇటీవల విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్యంతో నిర్వహించిన సదస్సు విజయవంతం కావడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది.

# దేవస్థానం అభివృద్ధి పనుల నిమిత్తం పెద్ద ఎత్తున భక్తుల విరాళాలు



**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం నందు గోశాల నిర్మాణం నిమిత్తం గోశాలలో షెడ్డునకు రేకులు నిమిత్తం మెరుగుమాల రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం భర్త మెరుగుమాల గంగరాజు 50116/- రూపాయలను మరియు గుడివాడ పట్టణ వాస్తవ్యులు కృష్ణారావు -గృహలక్ష్మి దంపతులు పైపుల నిమిత్తం 50116/- విరాళం ఇచ్చి ఉన్నారు అని కార్యనిర్వహణాధికారి కెవి గోపాలరావు ఓ ప్రకటనలో తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు సత్యనారాయణ (చిన్న) మరియు తూంపూడి సాంబశివరావు, కారుమూరి వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# మెగా పిటీయం... విద్యా విప్లవానికి శంఖారావం..

● పాఠశాల పండుగ కార్యక్రమం.. ● తల్లికి వందనం కింద 13వేల చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాలో పదివేల కోట్లు జమ..

● స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా విద్యారంగాన్ని ఆధునికంగా మార్పులు.. ● టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్

**అమరావతి,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో విద్యా రంగం సమాజ భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధిస్తుందని గట్టిగా నమ్మే దార్శనిక నాయకత్వం ఆధ్వర్యంలో, టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడలేని విధంగా రాష్ట్ర చరిత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, దాతలను ఒకే వేదికపై ఆత్మీయంగా కలిపే "పాఠశాల పండుగ" కార్యక్రమం "టీచర్స్ మీటింగ్ (మెగా పి టి యం )" రాష్ట్ర విద్యా వ్యవస్థలో కొత్త ఒరవడిని సృష్టిస్తోందని ఆయన తెలిపారు రాష్ట్రంలోని ప్రతి మూలకు చేరుకున్న ఈ పండుగ, విద్యలో నూతన ఒరవడికి సంస్కృతికి బీజం వేసిందని తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేసి, విద్యార్థుల అభ్యాస ప్రయాణంలో సమిష్టి జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి పేరెంట్ టీచర్ మీటింగ్ (పేటీఎం) ఒక బలమైన వేదికగా రూపొందిందని ఈ కార్యక్రమం ద్వారా, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పనిచేసే సంస్కృతిని స్థాపించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. పాఠశాల పండుగ యొక్క మెగా పేటీఎం 1.0 అపూర్వ విజయాన్ని సాధించింది. రాష్ట్రంలోని 44,956 పాఠశాలల్లో 25.46 లక్షల మంది తల్లిదండ్రులు, 27,395 మంది పూర్వ విద్యార్థులు, 22,200 మంది దాతలు మరియు 36,918 మంది ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు బలమైన పునాది వేశారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం "మెగా పిటియం 2.0" కార్యక్రమాన్ని దేశంలోనే అత్యంత ఆదర్శవంతంగా నిర్వహించింది. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో ఒకేసారి మొత్తం 61,వేల పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ అతిపెద్ద తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశంలో 74.96.228 మంది విద్యార్థులు 3,32, 770 మంది ఉపాధ్యాయులు 1,49,92, 456 మంది తల్లిదండ్రులు తోపాటు సంరక్షికులు మొత్తం 2, 28 వేల కోట్లకు పైగా పాల్గొన్నారని ఈ అపురూప విజయంతో ఆంధ్ర ప్రదేశ్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందని ఆయన తెలిపారు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్టాత్మంగా విజయవంతంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ల కొనసాగింపుగా ఇప్పుడు మెగా పేటియం 3.0ను మరింత భవ్యంగా మరింత ప్రభావవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన తెలిపారు ఈసారి కేవలం



పాఠశాలలకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మెగా బిటిఎమ్ 3.0 ఒక భారీ విద్య మహోత్సవంగా విద్యార్థి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల మహాసమ్మేళనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ఆయన తెలిపారు ఈ మహా కార్యక్రమం ద్వారా మరొకసారి ఆంధ్రప్రదేశ్ను ప్రపంచ విద్యా రంగంలో ఆదర్శంగా నిలపాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు ఓటమి పాలనలో విద్య కొత్త వెలుగులు వస్తున్నాయని గత ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య విధానాల వల్ల బలహీనపడిన విద్య వ్యవస్థను బలోపేతం చేయటానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు పాఠశాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మొదటి మెట్టుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మేమున్నాము అని నినాదంతో తల్లిదండ్రులకు భరోసా ఇస్తూ ఈ పండుగను మరపురాని అనుభవంగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తుందని ఆయన తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ సర్కా బడుగుల రూప రేకులు సంగతి అటుంచితే గత ఐదేళ్లలో లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వం బడులకు దూరం చేసిందని ఆయన మండిపడ్డారు అసమర్థ విధానాలతో సాగిన వైసీపీ ప్రభుత్వ పాలన రాష్ట్ర విద్యావస్థ నిర్వీర్యం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు నాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపట్టిన లేక పథకాలు రద్దు చేసిందని బాలికలకు సైకిల్ పంపిణీ ని ఆపేస్తుందని డిజిటల్ వర్చువల్ క్లాస్ రూములు, ఫైబర్ గ్రిడ్ సదుపాయాలు మున్సిపల్ పాఠశాలలో వర్చువల్ క్లాస్ రూములను తీసివేసిందని ఆయన విమర్శించారు ప్రపంచం గుర్తించే మాతృభాషలో విద్య నేర్చుకునే హక్కును నశింపజేస్తూ నిర్బంధ ఇంగ్లీష్ విద్య విధానాన్ని అమలు చేసిందని ఆయన విమర్శించారు మాతృభాషను హత్య చేసి దేశంలోనే మూడో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 19వ స్థానానికి దిగజారిందని ఆయన విమర్శించారు గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా జరపలేదని టీచర్లకు ఒక నెల కూడా జీతాలు సరిగా ఇవ్వలేదని నాడు నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశామని, ఇంగ్లీష్ మీడియం తో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి ప్రభుత్వ పాఠశాలలను ఉద్ధరించేశామని చెప్పుకునే గత ప్రభుత్వపు అభూత కల్పనలు జాతీయ సర్వే సంస్థ "అసర్" బయటపెట్టిందని ఆయన తెలిపారు,

**కూటమి ప్రభుత్వంలో మళ్లీ విద్యారంగం వెలుగులు..**

ప్రపంచానికి అవసరమైన మేలిమి మానవ వనరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కేజీ నుండి పీజీ వరకు కరిక్యులంలో మార్పులు తెచ్చిందని ఆయన తెలిపారు పేదరికం కారణంగా ఎవరూ చదువుకు దూరం కాకూడదని ఉద్దేశంతో ఎంతోమంది పిల్లల్ని చదివిస్తే అంతమందికి రూ 13 వేల చొప్పున అర్హులైన 62.27 లక్షల మంది పాఠశాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో దాదాపు పదివేల కోట్లు రూపాయలను జమ చేశామని ఆయన తెలిపారు. బడులు తెరిచే నాటికే 35,94,774 మందికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందజేశామని మెగా డీఎస్సీ ద్వారా 16, 347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి యువ ఉపాధ్యాయులతో విద్యాశాఖను బలోపేతం చేశామని, అవినీతికీ రాజకీయ నాయకుల ప్రమేయానికీ తావు లేకుండా 68 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టామని 4,477 మందికి పదోన్నతులు కల్పించామని ఆయన తెలిపారు. "డొక్కా సీతమ్మ" నైతిక విలువలు పెంపొందించేలా, మహిళలు గౌరవించేలా పాఠంశాలు రూపొందిందన్నారు. ప్రతి శనివారం నైతిక విలువల బోధన, ఆటపాటలతో పిల్లల మానసిక వికాసానికి తోడ్పాటు అందిస్తూ "నో బ్యాగ్ డే" అమలు చేస్తుందని ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక క్లాసును ఒక టీచర్ విధానములో 96 మోడల్ ప్రైమరీ స్కూలు ఏర్పాటు అయ్యాయని ఆయన తెలిపారు గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాల కారణంగా బలహీనమైన విద్యారంగాన్ని పునరుద్ధరించేందుకు తమ కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా విద్య రంగాన్ని ఆధునికంగా మార్చుతూ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని పాతర్ల రమేష్ తెలిపారు.

# డిజిటల్ యుగంలో కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరం



**గుడివాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ అక్షరాస్యత ఎంత అవసరమో ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.ఎస్.అప్పారావు అక్కినేని నాగేశ్వరరావు ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ కళాశాలలో జరిగిన ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు అకడమిక్ మరియు వృత్తిపరమైన ఎదుగుదలకు అత్యంత కీలకమైన, సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం వినియోగదారులుగా కాకుండా, సమస్య పరిష్కర్తలుగా ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అత్యంత ఉత్సాహభరితమైన మరియు విజ్ఞానవంతమైన క్విజ్ పోటీని ఘనంగా నిర్వహించబడింది. ఈ క్విజ్ పోటీలో కంప్యూటర్ ఫండమెంటల్స్, నెట్‌వర్కింగ్, ప్రోగ్రామింగ్ పై విద్యార్థులకు ప్రశ్నలు సంధించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని, తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కె.ఎస్. అప్పారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరిగ రామారావు చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎల్. ఆర్. కే. ప్రసాద్, ఏ.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. పి.జే.ఎస్. కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు, బోధన సిబ్బంది పాల్గొనగా, సాంకేతికతపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని కళాశాల యాజమాన్యం తెలియజేసింది.

## సామరస్యంగా ఉంటే అంతా మంచే జరుగుతుంది, పట్టాలు ఉన్నంత వరకూ మాత్రమే సాగుచేసుకోండి

● ఫారెస్ట్ భూమి ఒక్క సెంటు అక్రమించిన కఠిన చర్యలు తప్పవు: మంత్రి కొలుసు పార్థసారథి





**నూజివీడు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం దేవరగుంట,జంగంగూడెం గ్రామాల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న ఘర్షణ గొడవలు ఎట్టకేలకు సామరస్యంగా ముగిసింది. గత కొంతకాలంగా ఇరు గ్రామాల ప్రజలు ఫారెస్ట్ భూమి కోసం ఘర్షణలు పడుతున్న సంగతి తెలుసుకొని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి అధికారులతో కలిసి ఇరు గ్రామాల ప్రజలను సాగు రైతులను పిలిపించి ఇరు పక్షాలతో మాట్లాడి పట్టాల వివరాలు,సాగు రైతుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి సాధ్య సాధ్యల బట్టి అధికారులను బోర్డర్లు కేటాయించి ఎవరిది వారికి బౌండరీలు కేటాయించాలని అధికారులకు హెచ్చరించారు. సుమారు.100 మంది సాగు రైతులకు గాను సుమారు.70 సెంట్ల భూమి పట్టాలు ఇచ్చారని తెలుసుకున్న మంత్రి పట్టాలో ఉన్న భూమి తప్ప ఒక్క సెంటు కూడా ముందుకు అక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మిగిలిన ఫారెస్ట్ భూమిని పశు గ్రాసానికి కేటాయించి సరిహద్దులు నియమించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.సబ్ డివిజన్లు చేయలేదని ఒంకతో ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని,ఇరు గ్రామాల సాగు రైతులు కేటాయించిన సరిహద్దు దాటి ముందుకు వస్తే కఠిన చర్యలు తప్పవని పట్టాలు కూడా రద్దు చేస్తామని,ఇరువురూ కలిసి సామరస్యంగా భూమి సాగుచేసుకుంటే మంచిదని సూచించారు.డి,పట్టా ఉన్నవారు సాగు చేసుకోవచ్చని అన్నారు.చట్టాన్ని వ్యతిరేకించి చట్ట విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మోటర్లు కట్ చేసిన వారిని,చెట్లు నరికిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్వాంసాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని గొడవలు రెచ్చ గొట్టే వారిని ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సుమారు.200 మంది సాగు రైతులకు పట్టాలు ఇవ్వవలసి ఉందని రైతులు కోరగా సుమారు.82 సాగు రైతులకు పట్టాలు ఇప్పటికే ఇచ్చినట్లు అధికారులు తెలియజేసారు. మిగిలి గయ్యాల భూమి ని CCLA లో పెండింగులో ఉన్నాయని అధికారులు తెలియజేయగా ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు మిగిలిన రైతులకు పట్టాలు అందించే ప్రయత్నం చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. రైతులకు కేటాయించే బోర్డర్లు బౌండరీలు లాటరీ పద్ధతిలో పారదర్శంగా జరుగుతుందని మంత్రి తెలిపారు.బోర్లు,చెట్లు ధ్వంసం చేసిన వారిని వారంలో పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులని యంత్రి ఆదేశించారు. ఎంతటి వారినైనా వదిలేది లేదని ఆన్నారు.అందరూ కలిసి మెలిసి ఉండి సామరస్యంగా భూమిని సాగు చేసుకుంటే అందరికీ మంచిదని అన్నారు..ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.వినూత్న,జిల్లా ఫారెస్ట్ అధికారి,పోలీసు అధికారులు తహాశీల్దార్ భద్రు,రెవిన్యూ,పోలీస్, అటవీ శాఖ అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అర్చన కు రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పురస్కారం

● అభినందించిన రాష్ట్ర మంత్రి ● ప్రశంసించిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్

● విశిష్ట సేవలకే ఈ ఉత్తమ అవార్డు: ప్రముఖ వైద్యులు




**విజయవాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** వైద్య వృత్తిలో విశిష్ట సేవలు అందించినందుకు గుర్తింపుగా డాక్టర్ అర్చన ప్రియదర్శినికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ వృత్తిలో ఎన్నో అవార్డులు అందుకున్న ఆమె తాజాగా మరో రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. వృత్తిలో నైపుణ్యతను ప్రదర్శించి, రికార్డు స్థాయిలో ఆమె శస్త్ర చికిత్సలు చేసి ఎందరికో పునర్జన్మ ప్రసాదించారు. ఈ మేరకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి అవార్డును ప్రకటించి ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారంతో గౌరవించింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం (డిసెంబర్ 1న) విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతులు మీదుగా డాక్టర్ అర్చన ప్రియదర్శిని రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు.ఆమెను మంత్రితో పాటు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులు, ప్రముఖ వైద్యులు ఘనంగా సత్కరించారు. కాకినాడ జీజీహెచ్ ఫ్యామిలీ ప్లానింగ్ విభాగం పనిచేసిన ఆమె 2017 సెప్టెంబర్ నుంచి 2025 జూన్ మధ్య మొత్తం 75 మంది హెచ్ ఐవి బాధిత మహిళలకు కుటుంబ సంక్షేమ(ట్యూబెక్టమీ) శస్త్రచికిత్సలు నిర్వహించి వారి జీవిత విధానానికి దోహదపడ్డారు. ప్రసవం ఇబ్బందిగా మారిన సమయంలో బాధిత .మహిళల కష్టాన్ని తప్పించి డాక్టర్ అర్చన పునర్జన్మనిచ్చారు. ఈ నేపధ్యం ఆమె మొత్తం 3,919 కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేసి రికార్డు సృష్టించారు. ఇందుకు గుర్తింపుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాప్స్) ఈ ఉత్తమ రాష్ట్ర స్థాయి అవార్డును ప్రకటించింది. డాక్టర్ అర్చన ప్రియదర్శినిను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణు వర్ధన్, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జీజీహెచ్ వైద్యులు, వివిధ విభాగాల సిబ్బంది అభినందించారు. ఎయిడ్స్ సొసైటీ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖ వైద్యులు హర్షధ్వానాల నడుమ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డు గ్రహీత డాక్టర్ అర్చన ప్రియదర్శిని రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోవడంపై వైద్య ఆరోగ్య సంఘాల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

## విద్యా ఫలాల జాతర.. మెగా పీటీఎం 3.0

● కార్యక్రమ స్ఫూర్తికి అనుగుణంగా పకడ్బందీ ఏర్పాట్లు ● గౌరవ ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సాదర స్వాగతం ● ఈ నెల 5న జరిగే కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషిచేయండి ● ప్రోగ్రెస్ రిపోర్టులపై ముఖాముఖి చర్చలు అత్యంత కీలకం ● పాఠశాల, కళాశాల విద్యాశాఖల అధికారులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






**విజయవాడ,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** స్వర్ణాంధ్ర లక్ష్యాలు, విద్యా రంగ సంస్కరణ లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సమగ్ర వికాసం లక్ష్యంగా మెగా పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమా వేశాలు) కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ఈ నెల 5న మెగా పీటీఎం 3.0 జరగనుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మెగా పీటీఎం 3.0 సన్నద్ధతపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎంఈవోలు, ఇంటర్మీడియెట్ అధికారులతో ప్రత్యక్షంగా పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మెగా పీటీఎం స్ఫూర్తికి అనుగుణంగా కార్యక్రమం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అకడమిక్‌గా విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదికల (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు)పై ముఖాముఖి చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడంపై దృష్టిసారించాలన్నారు. పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టారని, ఇందులో పిల్లలు పరీక్షలు ఎలా రాశారు.. వారు సాధించిన పురోగతి, పొందిన ఫలితాలు ఇవన్నీ ప్రోగ్రెస్ కార్డులో ఉంటాయన్నారు. కేవలం మార్కులే కాకుండా పిల్లల విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగ సామర్థ్యాలు వంటివన్నీ నమోదై ఉంటాయన్నారు. చిన్నారుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడంలో తల్లిదండ్రులు ఎలాంటి సహాయసహకారాలు అందించాలనే విషయంపైనా దిశానిర్దేశం చేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

**ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు:** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెగా పీటీఎం 3.0కు ఏర్పాట్లు చేయాలని.. గౌరవ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో దశలవారీగా అమలుచేయాల్సిన కార్యక్రమాలతో పాటు ముఖాముఖి చర్చలు, ఎగ్జిబిషన్స్, తరగతి గదుల సందర్శన, కెరీర్ గైడెన్స్‌తో పాటు మనో వికాసానికి సంబంధించిన వీడియోల ప్రదర్శన తదితరాలకు సంబంధించి కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.రజనీకుమారి, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనకు సిద్ధపడుతున్న పిఎసిఎస్ ఉద్యోగులు



**పెడన,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని తమ డిమాండ్ల సాధన కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవు తున్నారు. ఈనెల ఆరవ తేదీ నుంచి వివిధ రూపాలలో వారు తమ నిరసనను వ్యక్తం చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసారు. ఏపీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరగనుందని సహకార సంఘాల ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,నందమూరు విశాల సహకార పరపతి సంఘం కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ రామ్మోహన్ రావు తెలిపారు. ఆరవ తేదీ నుంచి జనవరి 5 వరకు అనేక రూపాలలో తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు.తొలి రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు విధులకు హాజరుకానున్నారు. అనంతరం ఎనిమిదో తేదీ కేడీసీసీ బ్రాంచ్ ల వద్ద ధర్నా నిర్వహించి ఉద్యోగులు తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు అలాగే 16వ తేదీన జిల్లా కేంద్ర బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాలను అందించనున్నారు. 22 వ తేదీన జిల్లా కేంద్ర బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాలను అందించనున్నట్లు యార్లగడ్డ చెప్పారు. అలాగే 29 వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొననున్నట్లు రామ్మోహన్ రావు తెలిపారు. ఆ సందర్భంగా ఉన్నత అధికారులకు కూడా వినతిపత్రం అందించబోతున్నారు. జనవరి 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు పూర్తి అయ్యేవరకువిజయవాడ లోని ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు యార్లగడ్డ వార్తా ప్రభ ప్రతినిధికి తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వరుని మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ఆరంభం...

● ఉత్సవ విగ్రహాలకు విశేష స్నపన తిరుమంజనం... ● నేడు ధ్వజారోహణం, సూర్యప్రభ వాహనపై దేవదేవుడు...







**గుడ్లవల్లేరు,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసిన శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దశమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పీ నాగిరెడ్డి, ప్రసన్న, పీ వీ సుబ్బారెడ్డి, సుమలత ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను చేపట్టారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా ఆలయంలోని ఉత్సవ మూర్తులకు వేద పండితులు విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రాధాన్యతను వేద పండితులు వివరించారు. ఉత్సవాల తొలి రోజు స్నపన తిరుమంజనం, సేనాధిపతి ఉత్సవం, అంకురారోపణ, వాహనం (తిరుచ్చి), పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, డోకిపర్రు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఏడు కొండల వెంకటేశ్వర స్వామికి తిరుమలలో మాదిరిగా బ్రహ్మోత్సవాలు డోకిపర్రులో కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన ఆచార్యులు శ్రీధర్ వివరించారు. డిసెంబర్ ఐదో తేదీ వరకు ప్రతిరోజు విశేష హెూమాలు, ఉత్సవాలు, ఊంజల, వాహన సేవలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతాయి. వైఖానస, ఆగమ శాస్త్ర ప్రకారం డోకిపర్రు మహాక్షేత్రంలో జరిగే అర్చన కైంకర్యాల ఫలం రాజ, రాష్ట్ర, గ్రామ, యాజమాన్య, ఆచార్య,అర్చక, పరిచారికలకు ఆయా వైభవం కొద్దీ లభిస్తుందని అనుగ్రహ భాషణలో వేద పండితులు వివరించారు. తొలిరోజు ఉదయం ఆలయంలోని అన్ని ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మహాక్షేత్రం అనుబంధంగా ఉన్న వరసిద్ధి వినాయక దేవాలయానికి విఖాసనాచార్యులు , విశ్వక్సేనుల ఆధ్వర్యంలో వెళ్లి భూదేవిని ప్రార్థించి పుట్టమన్ను తెచ్చి పాలతో తడిపిన నవ ధాన్యాలను 12 మూకుళ్లలో వేసి దేవాలయ పరిసర ప్రాంతాల్లో ధాన్యం సమద్ధిగా పండటం తో పాటు, పాడి పంట అభివద్ధి చెందాలని ఉత్సవాల అంకురారోపణ శాస్త్రోక్తంగా చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ గ్రామంలోని సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ శాస్త్రోక్తంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.

**నేడు సూర్యప్రభ వాహనంపై దేవదేవుడి విహారం...** డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బుధవారం సూర్యప్రభ వాహనంలో విహరించనున్నారు. ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం ఉదయం వేడుకగా జరుగుతుంది. అనంతరం సూర్యప్రభ వాహనంలో శ్రీ వేంకటేశ్వరుడు విహరిస్తారు. అనంతరం శేష వాహనోత్సవం, సాయంత్రం ఊంజల సేవ, హంస వాహనోత్సవం, ఏకాంత సేవ నిర్వహిస్తారు.

## కొండపల్లి మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టండి-బొర్రా కిరణ్

● రాజకీయ పార్టీ ల నాయకులు, గ్రామ పెద్దలతో కలసి మైలవరం ప్రజా దర్బార్ లో జిల్లా కలెక్టర్

● లక్ష్మీశ, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కిరణ్





**మైలవరం,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** పర్యాటకప్రాంతంగా పేరుగాంచిన కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు ప్రధానంగా మెయిన్ రోడ్డు విస్తర్ణ పనులు ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్ అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కొండపల్లి గ్రామ పెద్దలతో కలసి మైలవరం పట్టణంలోని ఎస్ వి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ప్రజాదర్బార్ లో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మరియు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను కలసి వినతి పత్రం అందజేశారు.అనంతరం బొర్రా కిరణ్ మాట్లాడుతూ తాము వినతిపత్రం అందజేసిన వెంటనే ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ వెంటనే స్పందించి కలెక్టర్ లక్ష్మీశ దృష్టి కి తీసుకెళ్లగా, కలెక్టర్ అధికారులను పిలిసి తక్షణమే కొండపల్లి మెయిన్ రోడ్డు విస్తరణపై సర్వే చేయించి మార్కింగ్ పెట్టాలని ఆదేశించారని తెలిపారు. కొండపల్లి లో మెయిన్ రోడ్ ను విస్తరించి ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కొండపల్లి ఆర్య వైశ్య కల్యాణమండపంలో 17 ఫిబ్రవరి 2025 న అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ పెద్దల తో సమావేశమై విపులంగా చర్చించి మెయిన్ రోడ్డు ను విస్తరించాలని ఏకగ్రీవంగా తీర్మానించుకోవటం జరిగిందన్నారు. గతంలోనూ ఇంతకు ముందు ఉన్న జిల్లా కలెక్టర్ దృష్టికి అలాగే స్థానిక శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నా రు. రోజు రోజుకు పెరిగిపోతున్న కొండపల్లి ట్రాఫిక్ కష్టాలు, రోడ్డు ఇరువైపులా ఆక్రమణలపై ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి చెప్పడం జరిగిందని బొర్రా కిరణ్ తెలిపారు.కొండపల్లి మున్సిపాలిటీ లక్ష మందికి పైగా జనాభా కలిగిన మున్సిపాలిటీ అని,ఈ ప్రాంతం చుట్టూ పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పరిశ్రమలు, అయిల్ కంపెనీలు, ఎన్.టి.టి.పి. యస్ తో పాటు పారిశ్రామిక వాడ (ఐ.డి.ఎ) లలో పలు పరిశ్రమలు కలిగి ఉన్నాయి, అలాగే ఈ ప్రాంతంలో సుమారుగా వివిధ పరిశ్రమలలో పని చేసే ఉద్యోగస్తులు కానీ కార్మికులు కానీ వేలాది మంది పైగా నివాసాలు ఏర్పరుచుకొని ఈ మునిసిపాలిటీ పరిధి లోనే వుంటున్నారని కిరణ్ పేర్కొన్నారు.నిత్యం వేలాదిమంది ప్రజల రాకపోక లుతో వివిధ కళాశాలకు మరియు స్కూల్స్ కు వెళ్లే విద్యార్థులుతో ఒక ప్రక్క ట్రాఫిక్ సమస్య మరోవైపు ఇరుకు రహదారిలో వెళ్ళుట కు ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కొండపల్లి లో ఎప్పుడో బ్రిటిష్ కాలంనాటి మెయిన్ రోడ్డు ఇప్పటి వం-కు విస్తర్ణ కు నోచుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ మెయిన్ రోడ్ బి కాలనీ దగ్గర నుంచి ఎర్రబ్రిడ్జి వరకు "1.5 కిలో మీటర్లు" పైగా కలిగి చాలా ఇరుకుగా రోడ్డు ఉండటం వలన ఎదు రుగా ఒక వాహనం వస్తేనే తప్పుకోలేని పరిస్థితి అన్నారు. పాదచా రులు కూడా ఇబ్బందులకు గురి అవుతూ ఈ రోడ్డులో వెళ్ళాలి అంటే నరకం అను భవిస్తున్నారని తెలిపారు.రోడ్డు కు ఇరువైపులా ఇష్టానుసా రంగా ఇళ్ళ యజమానులు రోజువారీ చిరు వ్యాపారస్థు లకు అద్దెలకు ఇస్తూ నియమ నిబంధలను పాటించకుండా ట్రాఫిక్ ఇబ్బందులకు కారణం అవుతున్నారని,ఇప్పటికయినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలను ఈ కొండపల్లిని కాపాడాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ను కోరినట్లు బొర్రా కిరణ్ తెలియజేశారు.తనతో కలిసివచ్చిన అఖిల పక్ష ప్రతినిధులందకీ కిరణ్ ధన్యవాదాలు తెలియ జేశారు.కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టీబాబు, జనసేన మైలవరం ఇంచార్జ్ అక్కల గాంధీ లు కూడా సానుకూలంగా స్పందించారని కిరణ్ తెలి పారు.వినతిపత్రం అందచేసిన వారిలో మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబో యిన చిట్టీబాబు, జనసేన మైలవరం ఇంచార్జ్ అక్కల గాంధీ,డా.గంగా మధుసూదన రావు,కరిమికొండ బాలాజీ, వైస్సార్సీపీ నాయకులు పోరం కి రాజు (బాబ్జి ),చెరుకుమల్లి సురేష్, బీజేపీ కి చెందిన టి మాధురి,డా. మామిడి సీతారామారావు,బుడ్డి సురేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజలకు చేరువగా సుపరిపాలనే ధ్యేయంగా పీజీఆర్ఎస్

● ప్రజల చెంతకు జిల్లా యంత్రాంగం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ●మైలవరం నియోజకవర్గ ప్రజల నుంచి మొత్తం 595 అర్జీల స్వీకరణ






**మైలవరం,డిసెంబర్ 2 (వార్తాప్రభ) :** ప్రజల వెతలు తీర్చడానికే నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమా లను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు.స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ తో కలిసి కలెక్టర్ లక్ష్మీశ మైలవరం పట్టణంలోని ఎస్వీ కళ్యాణ మండపంలో మంగళవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి తక్షణ పరిష్కారానికి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు.నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 595 అర్జీలు వచ్చాయి. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు తదితరాలతో పాటు వివిధ రెవెన్యూ సేవలకు సంబంధించి కూడా అర్జీలు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజలు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రానవసరం లేకుండా నియోజక వర్గ స్థాయిలోనే తమ సమస్యలు తెలియజేసే అవకాశాన్ని నియోజకవర్గ పీజీఆర్ఎస్ కార్యక్రమాలు కల్పిస్తున్నాయన్నారు. జవాబుదారీతనంతో కూడిన సుపరిపాలన అందించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రజల చెంతకు వచ్చిందని తెలిపారు.ప్రజల సమస్యల కు సత్వర పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరించకుండా, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజా క్షేమం, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పీజీఆర్ఎస్‌తో పాటు స్థానిక సచివాలయాల దృష్టికీ తీసుకురావచ్చన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.వి.సతీష్, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు,మైలవరం నియోజక వర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహన రావు (గాంధీ),మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు,ఎంపీడివో లు,తహాశీ ల్దార్ లు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188